విశాఖపట్టణం
మంగళవారం 18 ఆగస్టు 2026

For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:206 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## బీసీ కోటాకు చుక్కెదురు..?

**34 శాతం రిజర్వేషన్లు కుదరకపోవచ్చు**


**న్యాయ నిపుణులు ప్రభుత్వానికి సూచన**

**నేడు కేబినెట్‌లో చర్చ**

**అక్టోబర్ మొదటివారంలోనే స్థానిక ఎన్నికలు**

**(అమరావతి - జయజయహే)**

బీసీ రిజర్వేషన్ల అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలోని తన చాంబర్‌లో పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలతో చర్చించారు. ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీపై కూడా నేతలు చర్చించారు. 34 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తే న్యాయపరంగా నిలబడే అవకాశం లేదని న్యాయ నిపుణులు సూచించినట్లు సమాచారం. రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని డెడికేటెడ్ కమిషన్ సమర్పించిన నివేదికపై మంగళవారం కేబినెట్ ..మిగతా 2లో



## డిఎస్సీలో ఎలాంటి అక్రమాల్లేవు

**పారదర్శకంగా నిర్వహించాం**

**వర్టికల్, హారిజాంటెల్ రిజర్వేషన్లు అమలు చేసాం**

**వైసీపీ ఆరోపణలకు అభ్యర్థుల ర్యాలీనే సమాధానం**

**అసెంబ్లీలో మంత్రి నారా లోకేస్ వివరణ**

**డిఎస్సీపై పవర్ పాయింట్ ప్రజంటేషన్**

**(అమరావతి - జయజయహే)**

ఎంతో బాధ్యతగా తీసుకుని, కేవలం 148 రోజుల్లోనే డీఎస్సీ నియామకాలు పూర్తి చేశామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాల సందర్భంగా మంత్రి నారా లోకేష్ మెగా డీఎస్సీ-2025 నియామకాలు, విద్యా రంగంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలపై కీలక ప్రసంగం చేశారు. డీఎస్సీ నియామకాలపై ..మిగతా 2లో

# సాక్ష్యాలుంటే సభ ముందు పెట్టాలి

**బురదజల్లడం అపోహలు సృష్టికే**

**మెరిట్ ఆధారంగానే నియామకాలు**

**ప్రతి దశలోనూ జాగ్రత్తలు తీసుకున్నాం**

**ఇప్పటికే క్లారిటీ ఇచ్చాం..**
**ఇక చర్చ అనవసరం**

**డిఎస్సీపై సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు**






2

## ఈసారి లోటు వర్షపాతమే..

**రానున్న రోజుల్లోనూ తక్కువ వర్షాలే**

**అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రకటన**

**(అమరావతి - జయజయహే)**

అసెంబ్లీలో మెగా డీఎస్సీ 2025పై కీలకమైన చర్చ జరిగింది. ఈ నియామకాల్లో అక్రమాలు జరిగాయని చాలా కాలంగా వైసీపీ ఆరోపణలు చేస్తూ వస్తోంది. రోడ్లపై నిరసనలు తెలియజేస్తోంది. అధికారులు ఎప్పటికప్పుడు వారు చేస్తున్న ఆరోపణలకు కౌంటర్ ఇస్తూనే వస్తున్నారు. అయినా తమ ఆరోపణలను మాత్రం వారు ఆపడం లేదు. దీంతో అసెంబ్లీలోనే చర్చ పెట్టి పూర్తి సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలని ప్రభుత్వం భావించింది. అనుకున్నట్టుగానే అసెంబ్లీలో విస్తృతంగా చర్చ సాగింది. ఇందులో మాట్లాడిన మంత్రులు, ముఖ్యమంత్రి వైసీపీ తీరును తప్పుపట్టారు. అక్రమాలు జరిగినట్టు ఆధారాలు చూపించకుండా కేవలం బురద జల్లుతున్నారని, అపోహలు సృష్టించడమే వారి పని అని అంటూ మండిపడ్డారు. సాక్ష్యాలు ఉంటే పట్టుకొని సభకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సవాల్ చేశారు. ఈ ప్రభుత్వంలో తప్పులకు ఆస్కారం లేదని అలాంటి వాటిని ఉపేక్షించే ప్రసక్తే లేదని అన్నారు. అదే టైంలో జరగని తప్పులు గురించి ఆధారాలు లేకుండా పదే పదే ఆరోపణలు చేసిన వారి కూడా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎలాంటి తప్పులు లేకుండా కేవలం ప్రతిభ ఆధారంగానే మెగా డీఎస్సీ 2025 నియామకాలు పూర్తి అయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తేల్చి చెప్పారు. తప్పులు లేకుండా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి దశలోనూ జాగ్రత్తలు తీసుకున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆ ..మిగతా 2లో



# మండలిలో మంటలు

**బొత్స, అచ్చెన్న మాటల యుద్ధం**

**బొత్సను దద్దమ్మ అంటూ సంబోధన**

**ఆంబోతులా ఎదిగితే సరిపోదని అచ్చెన్నకు కౌంటర్**

**డిఎస్సీపై సభలో గందరగోళం**

**(అమరావతి - జయజయహే)**

మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైఎస్సార్సీపీ చేసిన ఆందోళనతో శాసనమండలి కార్యకలాపాలకు తొలిరోజు తీవ్ర అంతరాయం కలిగింది. వైఎస్సార్సీపీ నినాదాలతో హోరెత్తించడంతో గందరగోళం నెలకొంది. విపక్ష నేత బొత్స సత్యనారాయణపై మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు సభలో దుమారం లేపాయి. ఇద్దరి మధ్యా జరిగిన వాగ్వాదం మండలిలో వేడిని పెంచింది. వైఎస్సార్సీపీ ఆందోళన వీడకపోవడంతో మండలిని ఛైర్మన్ మంగళవారానికి వాయిదా వేశారు. గందరగోళం- సభ వాయిదా: మండలి కార్యక్రమాలు ప్రారంభం కాగానే వైఎస్సార్సీపీ ..మిగతా 2లో






## ఉత్తరాంధ్రలో సరికొత్త చరిత్ర

**భోగాపురం ఎయిర్ పోర్టు ఆపరేషన్స్ కు శ్రీకారం**

**కేక్ కట్ చేసి స్వీట్లతో సంబరాలు**

**ప్రయాణికులకు ఫస్ట్ ఫ్లైట్ సర్టిఫికెట్లు**

2



## 4,192 క్రిమినల్ కేసులు పెండింగ్

**దేశవ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యేలపై అభియోగాలు**

**సుప్రీంకోర్టుకు వెల్లడించిన అమికస్ క్యూరీ**

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

దేశవ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యేలపై 4,192 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు అమికస్ క్యూరీ సుప్రీంకోర్టుకు వెల్లడించారు. పదేళ్లకు పైగా 519 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 5 నుంచి10 ఏళ్ల మధ్య 754 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉన్న క్రిమినల్ కేసుల సత్వర విచారణపై అమికస్ క్యూరీ తాజాగా సుప్రీంకోర్టుకు 22వ నివేదికను సమర్పించారు. అమికస్ క్యూరీ సమర్పించిన నివేదికలోని వివరాల మేరకు.. సిట్టింగ్ ఎంపీలపై 335 కేసులు పెండింగ్‌లో ఉండగా.. సిట్టింగ్ ఎమ్మెల్యేలపై 1,222 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మాజీ ఎంపీలపై 269 కేసులు.. మాజీ ఎమ్మెల్యేలపై 1,339 కేసులు ..మిగతా 2లో

# బీజేపీ బిగ్ ప్లాన్

**జాతీయ కార్యవర్గంలో భారీ మార్పులు**

**పురంధేశ్వరికి జాతీయ ఉపాధ్యక్షురాలిగా నియామకం**

**తెలంగాణ నేతలకు పెద్దగా దక్కని ప్రాధాన్యత**

**ఏడు నెలల తర్వాత నితిన్ నబిన్ కొత్త టీమ్**






**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

ఏడు నెలల తర్వాత భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తన కొత్త టీమ్‌ను ప్రకటించారు. పార్టీ భవిష్యత్ వ్యూహాలు, సంస్థాగత బలోపేతాన్ని దృష్టిలో పెట్టుకుని కీలక పదవుల్లో మార్పులు, చేర్పులు చేశారు. కొత్త కార్యవర్గంలో పలువురు సీనియర్ నేతలకు కీలక బాధ్యతలు అప్పగించగా.. మరికొందరికి పదవులు కొనసాగించారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులుగా మొత్తం 13 మందిని నియమించారు. ఇందులో రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే, ఆంధ్రప్రదేశ్ నుంచి రామ్ మాధవ్, పురంధేశ్వరి వంటి కీలక నేతలకు చోటు దక్కింది. ఇదే సమయంలో తెలంగాణకు చెందిన డీకే అరుణను జాతీయ ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించారు. కొత్త జాతీయ కార్యవర్గంలో తెలంగాణకు ప్రాతినిధ్యం దక్కకపోవడం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. జాతీయ ప్రధాన కార్యదర్శులుగా మొత్తం ఎనిమిది మందిని నియమించారు. మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి ..మిగతా 2లో

## గ్రీన్ ఏపీ ఛైర్మన్‌గా నాగబాబు

**పచ్చదనం పెంపు, అటవీ విస్తీర్ణాన్ని పెంచే లక్ష్యం**

**2047 నాటికి 50 శాతం గ్రీన్ కవర్ సాధానే టార్గెట్**

**ఎమ్మెల్సీకి క్యాబినెట్ ర్యాంక్ హోదా**

**(అమరావతి - జయజయహే)**



రాష్ట్రంలో పచ్చదనం పెంపు, అటవీ విస్తీర్ణాన్ని పెంచే లక్ష్యంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా పవన్ కల్యాణ్ సోదరుడు, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు(నాగేంద్రరావు)ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పర్యావరణ, అటవీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం ..మిగతా 2లో

# సాక్ష్యాలుంటే సభ ముందు పెట్టాలి

మొదటి పేజీ తరువాయి...



విషయం రాసిన అభ్యర్థులకు, ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు తెలుసునని అన్నారు. అందుకే వైసీపీ ఎన్ని విధాలుగా తప్పుడు ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని చూస్తున్నా పట్టించుకున్న వారు లేరని అభిప్రాయపడ్డారు. కేవలం వైసీపీ నేతలు మాత్రమే రోడ్డుపైకి వచ్చి నానాయాగి చేస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. వారు చేస్తున్న ఆరోపణలకు అధికారులు సాక్ష్యాలతో సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. ధర్నాలు చేస్తున్న వైసీపీ నేతలకు స్పోర్ట్స్‌కు గేమ్స్‌కు తేడా తెలియదన్నారు. అందుకే ఏదో జరిగిపోయిందనే భ్రమల్లో ప్రజలను తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి అధికారులతోపాటు డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులు కూడా రోడ్డుపైకి వచ్చి వైసీపీ నేతలకు కౌంటర్ ఇచ్చారని, వీరిలో ఎక్కువ మంది మహిళలే ఉన్నారని గుర్తు చేశారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు చేస్తున్నా వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని చెప్పారు చంద్రబాబు. వారు అధికారంలో ఉన్నప్పుడు డీఎస్సీ ఉద్యోగాల నోటఫికేషన్ వేయలేకపోయామనే కోపంతోనే ఇలాంటివి చేస్తున్నారని అన్నారు. తాము ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టు నోటిఫికేషన్ ఇచ్చామని, 108 రోజుల్లోనే ప్రక్రియను ఎలాంటి తప్పుల్లేకుండా పూర్తి చేశామని అన్నారు. ఇందులో భాగమైన అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృతజ్ఞత తెలిపారు. ఇంత పకడ్బంధీగా ఉద్యోగ నియామకాలు పూర్తి చేసినప్పటికీ వైసీపీ తప్పుడు ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. నిజంగా వారి వద్ద ఏమైనా ఆధారాలు ఉంటే కచ్చితంగా అసెంబ్లీకి వచ్చి వాటిని టేబుల్‌పై పెట్టాలని సవాల్ చేశారు. రోడ్డుపై నిలబడి ఏవో కాగితాలు చూపించి ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. తమ ప్రభుత్వంలో తప్పుల చేసేందుకు ఆస్కారం లేదని అలాంటి తప్పులు ఉన్నట్టు నిరూపిస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని చంద్రబాబు అన్నారు. అదే టైంలో సాక్ష్యాలు లేకుండా పదే పదే తప్పుడు ఆరోపణలు చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తప్పులు జరిగి ఉంటే చర్యలు, సాక్ష్యాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేసినా చర్యలు ఉంటాయని వైసీపీ వాళ్లకు వార్నింగ్ ఇచ్చారు. ఇక డీఎస్సీపై క్లియర్‌గా అన్ని వివరాలు చెప్పేశామని, ఇకపై దీని గురించి చర్చ అనవసరమని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.



# డీఎస్సీలో ఎలాంటి అక్రమాల్లేవు

మొదటి పేజీ తరువాయి...

శాసనసభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి విమర్శలకు చెక్ పెట్టారు. అసెంబ్లీలో నారా లోకేష్ మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో నిరుద్యోగుల కోసం ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రక్రియను ఎంతో బాధ్యతగా నిర్వర్తిస్తున్నాం. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్ష మేరకు టీచర్ల నియామకాలు, బదిలీలను అత్యంత పారదర్శకంగా నిర్వహించాం. ఇప్పటివరకు టీడీపీ ప్రభుత్వాల హయాంలో మొత్తం 1.80 లక్షల టీచర్ పోస్టులను భర్తీ చేశాం. టీచర్లలో నైపుణ్యాభివృద్ధి పెంచేందుకు కూటమి ప్రభుత్వం వారిని సింగపూర్, ఫిన్‌లాండ్ వంటి విదేశాలకు పంపించాం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీచర్లను మద్యం దుకాణాల వద్ద నిలబెట్టి, వారి గౌరవాన్ని భంగపరిచేలా చేశారని' విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ప్రజలందరికీ పూర్తి స్వేచ్ఛ ఉందని, వ్యవస్థను ఎవరైనా ప్రశ్నించవచ్చని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్ల అమలుపై భిన్నాభిప్రాయాలు ఉన్నవారు కోర్టులను ఆశ్రయించగా, 336 కేసులు నమోదైనప్పటికీ కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని చర్చ సందర్భంగా తెలిపారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా డీఎస్సీలో వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్ విధానాన్ని అమలు చేశామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నియామకాలు అత్యంత పారదర్శకంగా జరగడం వల్లే వేలాది మంది టీచర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రభుత్వానికి అండగా నిలిచారు. ఇందులో భాగంగా వైసీపీ చేస్తున్న విమర్శలను ఖండిస్తూ, విజయవాడలో మెగా డీఎస్సీ ద్వారా నియమితులైన టీచర్లు భారీ ఆత్మగౌరవ ర్యాలీ చేశారని' మంత్రి లోకేష్ వివరించారు.

# ఈసారి లోటు వర్షపాతమే..

## రానున్న రోజుల్లోనూ తక్కువ వర్షాలే

## అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రకటన

(అమరావతి - జయజయహే)

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని, వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సాధారణ వర్షపాతం కంటే తీవ్రమైన లోటు కనిపిస్తోందని చెప్పారు. సోమవారం అసెంబ్లీలో ఎల్‌నినోపై చర్చ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. అసెంబ్లీ వేదికగా ఎల్‌నినో విషయమై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కావేరి జలాల విషయంలో తమిళనాడు-కర్ణాటక మధ్య జరుగుతున్న వివాదంలో సుప్రీం కూడా జోక్యం చేసుకుందని తెలిపారు. ముఖ్యమంత్రి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'గ్రామాల మధ్య, రాష్ట్రాల మధ్య, దేశాల మధ్య కూడా నీటి సమస్యలు వస్తున్నాయి. 2026 జూన్-డిసెంబర్ వరకు 867 మిల్లీ మీటర్ల వర్షపాతం పడాల్సి ఉంటే.. కేవలం 557 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదవుతుందని ఓ అంచనా. ఈ ఏడాది అన్ని జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కానుంది. కొన్ని జిల్లాల్లో జులై నెలలో 68 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఆగస్టు నెలలో 35 శాతం, సెప్టెంబర్ నెలలో 35 శాతం, అక్టోబర్‌లో 25 శాతం, నవంబర్‌లో 20 శాతం మేర లోటు వర్షపాతం నమోదు కానుంది'.. 'డిసెంబర్ నెలలో మాత్రం 1 శాతం అదనపు వర్షపాతం నమోదువుతుంది. వివిధ బేసిన్లల్లో జలాలు తగ్గిపోతున్నాయి. ప్రాజెక్టులు, రిజర్వాయర్లల్లో జలాలు అడుగంటుతున్నాయి. శ్రీశైలానికి 753 టీఎంసీల నీరు రావాల్సి ఉంటే.. ఈసారి 214 టీఎంసీల నీరు మాత్రమే వచ్చింది. మన రాష్ట్రానికి నీళ్లు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వస్తాయి. వాళ్ల రిజర్వాయర్లు నిండిన తర్వాతే మనకు నీళ్లు వస్తాయి. దీని వల్ల శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు నీరు తక్కువగా వస్తోంది. గోదావరి బేసిన్లో కూడా జలాల లభ్యత తక్కువగా ఉంది' అని అన్నారు.


# గ్రీన్ ఏపీ చైర్మన్‌గా నాగబాబు

మొదటి పేజీ తరువాయి...

జారీ చేసిన జీవోఆర్టీ నంబర్ 93 ప్రకారం.. ఏపీ గ్రీన్ సొసైటీని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు గవర్నింగ్ బోర్డు, ఎగ్జిక్యూటివ్ కమిటీతో పాటు జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ గ్రీన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల పాలక మండళ్లను ఏర్పాటు చేసింది. రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో ప్రస్తుతం ఉన్న అటవీ, చెట్ల కవరేజీని 2047 నాటికి 50 శాతానికి పెంచడం ఏపీ గ్రీన్ ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. పచ్చదనం పెంపు, అటవీ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయడంపై ఈ సంస్థ ప్రధానంగా దృష్టి సారించనుంది. ప్రభుత్వం ఆమోదించిన ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ కూర్పు ప్రకారం.. ప్రభుత్వం నామినేట్ చేసే చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో కమిటీ పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబుకు ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ప్రభుత్వం నియమించింది. ఏపీ గ్రీన్ లక్ష్యాలు, కార్యకలాపాల అమలులో సమన్వయం తీసుకురావడంతో పాటు.. కార్యక్రమాల పురోగతిని పర్యవేక్షించే బాధ్యతలను ఆయన నిర్వహించనున్నారు.

### కేబినెట్ ర్యాంక్ హోదా

ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన నాగబాబుకు ప్రభుత్వం కేబినెట్ ర్యాంక్ హోదా కల్పించింది. ఈ హోదా ఆయన పదవిలో కొనసాగుతున్న కాలంలో వర్తించే నిబంధనలు, షరతులకు లోబడి ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంలో ఏపీ గ్రీన్ కీలక పాత్ర పోషించనుంది. జిల్లా స్థాయిలోని గ్రీన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత ఎగ్జిక్యూటివ్ కమిటీపై ఉండనుంది. ఆంధ్రప్రదేశ్‌లో పచ్చదనాన్ని పెంచడం, అడవులను అభివృద్ధి చేయడం, చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవస్థలో కీలక భాగమే ఆంధ్రప్రదేశ్ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ. సులభంగా చెప్పాలంటే.. రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, అటవీ విస్తరణకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అమలు చేయడం, సమన్వయం చేయడం, పర్యవేక్షించడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత.



# ఉత్తరాంధ్రలో సరికొత్త చరిత్ర

## భోగాపురం ఎయిర్ పోర్టు ఆపరేషన్స్ కు శ్రీకారం

## కేక్ కట్ చేసి స్వీట్లతో సంబరాలు

## ప్రయాణీకులకు ఫస్ట్ ఫ్లైట్ సర్టిఫికేట్లు

(భోగాపురం, జయజయహే)

ఉత్తరాంధ్ర చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలైంది . ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంతో ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాలను లాంఛనంగా ప్రారంభించారు అధికారులు. దీంతో హైదరాబాద్ నుంచి బయలుదేరిన తొలి షెడ్యూల్డ్ విమానం ఉదయం 6:45 గంటలకు భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంది. అనంతరం ఉదయం 7:30 గంటలకు తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరనుంది అలాగే ఉదయం 8:00 గంటలకు హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్లనుంది. ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని ఎయిర్‌లైన్స్ సిబ్బంది ప్రయాణికులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే ఈ తొలి ప్రయాణంలో పాల్గొన్న ప్రయాణికులకు గుర్తుగా 'ఫస్ట్ ఫ్లైట్ సర్టిఫికెట్లు' అందజేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ముస్తాబైన సరికొత్త గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌కు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంగా నామకరణం చేశారు. ఈ ఎయిర్‌పోర్ట్, సోమవారం ఉదయం నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. విశాఖపట్నానికి ఉన్న అంతర్జాతీయ గుర్తింపు కోడ్ 'ఝ్గ' ఇకపై భోగాపురం నుండే రన్ కానుంది.

### విశాఖ ఎయిర్‌పోర్టు బైబై

ఇదిలా ఉండగా అటు షీలానగర్‌లోని పాత ఎయిర్‌పోర్ట్‌లో ప్యాసింజర్ కోలాహలం ఆదివారంతో ముగిసిపోయింది. కేంద్ర పౌర విమానయాన శాఖ నిబంధనల ప్రకారం.. ఆదివారం రాత్రి నుండే ఇక్కడ కమర్షియల్ ఫ్లైట్స్ పూర్తిగా బంద్ అయ్యాయి. రాబోయే రోజుల్లో ఈ రన్‌వే కేవలం మిలిటరీ, నేవీ రక్షణ అవసరాలు, విఐపి విమానాల రాకపోకలకే పరిమితం కానుంది. ఇదిలా ఉండగా కొత్తగా ప్రారంభమైన భోగాపుం ఎయిర్‌పోర్టుకు విశాఖ నుంచి ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు ఆర్టీసీ పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తోంది. విమానాశ్రయానికి వెళ్లేందుకు ఏరో ఎక్స్‌ప్రెస్‌ల పేరుతో 20 ఎలక్ట్రికల్ బస్సులు నడుపుతోంది. ఆ బస్సులను ప్రారంభించారు మంత్రి అనగాని సత్యప్రసాద్.

# మండలిలో మంటలు

మొదటి పేజీ తరువాయి...

సభ్యులు డీఎస్సీపై ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని మండలి ఛైర్మన్ మోషేను రాజు తిరస్కరించారు. దీంతో వైఎస్సార్సీపీ సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారి ఆందోళనల మధ్యే ప్రశ్నోత్తరాలు కొనసాగించారు. కేవలం 2 ప్రశ్నలే జరిగాయి. వైఎస్సార్సీపీ సభ్యుల తీరుపై మంత్రులు మనోహర్, అచ్చెన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. సభను ఆర్డర్‌లో పెట్టాలని ఛైర్మన్‌ను కోరారు. అదే సమయంలో డీఎస్సీపై విచారణకు బొత్స డిమాండ్ చేశారు. మంత్రి అచ్చెన్న తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీపై మాట్లాడే అర్హత వైఎస్సార్సీపీకి లేదన్నారు. బొత్సపైనా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైఎస్సార్సీపీ సభ్యులు నినాదాలు ఆపకపోవడంతో సభను కొద్దిసేపు వాయిదా వేశారు. సభ మళ్లీ ప్రారంభమయ్యాక బొత్సకు మంత్రి అచ్చెన్న క్షమాపణ చెప్పాలంటూ వైఎస్సార్సీపీ సభ్యులు నినదించారు. మంత్రి అచ్చెన్న వ్యాఖ్యలపై బొత్స అభ్యంతరం వ్యక్తం చేశారు. పని చేయటం చేతగానివారిని ఉద్దేశించి మాట్లాడే మాటనే తాను అన్నానని అందులో అసభ్యత లేదని అచ్చెన్న బదులిచ్చారు. వైఎస్సార్సీపీ సభ్యుల ఆందోళనతో సభను ఛైర్మన్ మరోసారి వాయిదా వేశారు.

# బీసీ కోటాకు చుక్కెదురు..?

మొదటి పేజీ తరువాయి...

సమావేశంలో సమగ్రంగా చర్చించి, అందరి అభిప్రాయాలు తీసుకుందామని సీఎం అన్నట్లు తెలిసింది. కమిషన్ నివేదికతో పాటు పార్టీ పరంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశాన్ని పరిశీలించాలని కొందరు మంత్రులు సూచించినట్లు సమాచారం. మరోవైపు అక్టోబర్ మొదటి వారంలో ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. వెనుకబడిన కులాల రిజర్వేషన్ల ఖరారు కోసం కుటుంబ సమగ్ర సర్వేను ప్రాతిపదికగా తీసుకున్న డెడికేటెడ్ కమిషన్ తన నివేదికను సీఎం చంద్రబాబుకు అందించింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం నియమించిన డెడికేటెడ్ కమిషన్ ప్రభుత్వానికి తన నివేదికను సమర్పించింది. విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్‌రంజన్ మిశ్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి నివేదికను అందించారు. దీనిపై సమగ్ర అధ్యయనం తర్వాత రేపు (మంగళవారం) జరిగే మంత్రివర్గ సమావేశంలో ఆమోదించనున్నారు. అక్టోబర్ మొదటి వారంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఫిబ్రవరిలో కమిషన్ ఏర్పాటు కాగా 6 నెలల సమగ్ర అధ్యయనం తర్వాత కమిషన్ 2 వేలకుపైగా పేజీలతో 6 వాల్యూమ్‌లుగా నివేదికను రూపొందించింది.

# 4,192 క్రిమినల్ కేసులు పెండింగ్

మొదటి పేజీ తరువాయి...

పెండింగ్‌లో ఉన్నాయి. మరో 700 కేసుల దర్యాప్తు ఇంకా పూర్తికాలేదు. 360 కేసులు మూడేళ్లకు పైగా దర్యాప్తులో ఉన్నాయి. ఇక, లోక్‌సభలోని 543 మంది సభ్యుల్లో 251 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ నివేదిక వెల్లడించింది. లోక్‌సభలోని 170 మంది సభ్యులపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయని ఆ నివేదిక తెలిపింది.



# బీజేపీ బిగ్ ప్లాన్

మొదటి పేజీ తరువాయి...

జాతీయ జనరల్ సెక్రటరీ బాధ్యతలు అప్పగించారు. పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న బీఎల్ సంతోష్‌ను సంస్థాగత ప్రధాన కార్యదర్శి పదవిలో కొనసాగించారు. ఆయనకు పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక బాధ్యతలు యథావిధిగా కొనసాగనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డికి కూడా కొత్త బృందంలో కీలక బాధ్యత లభించింది. ఆయనను జాయింట్ కో-ఆర్డినేటర్‌గా నియమించారు. అలాగే కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జ్‌గా తరుణ్ చుగ్‌ను నియమించారు. ఓబీసీ విభాగానికి కొత్త అధ్యక్షుడిగా అమర్‌పాల్ మౌర్యను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆర్థిక వ్యవహారాల్లోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను పార్టీ కోశాధికారిగా నియమించారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలు నిర్వహించిన రాజేష్ అగర్వాల్ స్థానంలో పీయూష్ గోయల్ బాధ్యతలు చేపట్టనున్నారు. రాజేష్ మంగళ్‌ను సహ-కోశాధికారిగా నియమించారు. ఇక పార్టీ మీడియా వ్యవహారాల్లో అనిల్ బలూని తన బాధ్యతల్లో కొనసాగనున్నారు. పార్టీకి సంబంధించిన మీడియా కమ్యూనికేషన్, ప్రచార వ్యూహాల్లో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు. కొత్త కార్యవర్గ కూర్పులో ప్రాంతీయ సమీకరణాలు, అనుభవం, సంస్థాగత సామర్థ్యం, భవిష్యత్ రాజకీయ వ్యూహాలను పరిగణనలోకి తీసుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా సీనియర్ నేతలతో పాటు కొత్త తరానికి చెందిన నేతలకు కూడా బాధ్యతలు అప్పగించడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యం కనిపిస్తోంది. అయితే తెలంగాణకు కొత్త జాతీయ కార్యవర్గంలో చోటు దక్కకపోవడం చర్చకు దారితీస్తోంది. గతంలో జాతీయ స్థాయిలో కీలక పదవుల్లో ఉన్న నేతలకు ప్రస్తుత కూర్పులో ప్రాధాన్యం తగ్గడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. మరోవైపు వసుంధర రాజే, రామ్ మాధవ్, పురంధేశ్వరి వంటి నేతలకు ఉపాధ్యక్ష బాధ్యతలు ఇవ్వడం బీజేపీ జాతీయ స్థాయిలో తీసుకున్న కీలక నిర్ణయంగా భావిస్తున్నారు. త్తంగా నితిన్ నబిన్ కొత్త టీమ్‌లో భారీ మార్పులు, కీలక నియామకాలు చోటుచేసుకున్నాయి. రానున్న రోజుల్లో ఈ కొత్త కార్యవర్గం పార్టీ సంస్థాగత విస్తరణ, రాష్ట్రాల వారీగా రాజకీయ వ్యూహాలు, ఎన్నికల సన్నద్ధతలో ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

# హజ్ -2027కు విమాన రాకపోకల తేదీలు ఖరారు

## మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్

**అమరావతి, ఆగస్టు17 (జయ జయహే )**



పవిత్ర హజ్ యాత్ర -2027 కోసం సౌదీ అరేబియాకు విమానాల రాకపోకల తేదీలు ఖరారు అయినట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ సోమవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 8వ తేదీ నుండి ప్రారంభమై , మే 9వ తేదీవరకు ఇండియా నుండి సౌదీకి విమానాలు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. సౌదీ నుండి ఇండియా కు మే 21వ తేదీ నుండి జూన్ 20 వ తేదీవరకు తిరుగు ప్రయాణపు విమానాలు వస్తాయని తెలిపారు. ప్రస్తుతానికి విమాన రాకపోకల తేదీలు ఖరారు అయ్యాయని, ఏ ఏ ఏంబార్కేషన్ కేంద్రాల నుండి ఏ ఏ తేదీన విమానాలు వెళతాయి అన్న వివరాల నిర్ధారణ ఇంకా ఖరారు కాలేదన్నారు. ఖరారు అయిన వెంటనే బహిరంగ ప్రకటన ద్వారా హాజీలకు ఈ సమాచారాన్ని మైనారిటీ మంత్రిత్వ శాఖ ద్వారా చేరవేయడం జరుగుతుందని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. కాగా వచ్చే ఏడాది హజ్ యాత్ర కోసం 2830 మంది యాత్రికులు ఏపీ నుంచి దరఖాస్తు చేసుకోగా,2792 మంది ఎంపికయ్యారని, వీరిలో 460 మంది షార్ట్ హజ్ కు దరఖాస్తు చేసుకున్న విషయాన్ని మంత్రి మరోసారి గుర్తు చేశారు. విజయవాడ ఏంబార్కేషన్ కేంద్రం నుంచి హజ్ కు వెళ్లేందుకు 637 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. విజయవాడ ఎంచుకున్న వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.లక్ష ఆర్థిక సాయంతో పాటు వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను, ఏర్పాట్లను పగడ్బందీగా చేసేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసిందని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు.

**ఇమాములు,మౌజన్ల గౌరవ వేతనాలకు రూ.22.50 కోట్లు విడుదల**

రాష్ట్రంలోని 10000 మంది ఇమాములు, మౌజన్ల గౌరవ వేతనాల చెల్లింపు కోసం కూటమి ప్రభుత్వం రూ.22.50 కోట్లు విడుదల చేసిందని మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ప్రస్తుత ఏడాది ఏప్రిల్,మే,జూన్ లకు సంబంధించి మూడు నెలలకు గాను గౌరవ వేతనాల చెల్లింపు కోసం నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. ఇమాములకు రూ.10,000, మౌజన్ల కు రూ. 5,000 ప్రకారం మూడు నెలలకు సంబంధించిన మొత్తాన్ని సంబంధిత మసీదు కమిటీల బ్యాంక్ అకౌంట్లకు నేరుగా జమ చేసే ప్రక్రియ త్వరలో పూర్తి అవుతుందని మంత్రి పేర్కొన్నారు. మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తూనే, వారికి ఇచ్చిన హామీలన్నింటిని కార్యాచరణ బద్ధంగా నెరవేర్చడం కోసం సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తున్నదని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు.

# కళాభారతిలో 40 వసంతాల వేడుక

### 6 రోజుల పాటు కళా ఉత్సవాల కానుక

### పోస్టర్‌ను ఆవిష్కరించిన వీఎండీఏ ఛైర్మన్ రాజు

**విశాఖపట్నం, ఆగస్టు 17, జయ జయహే :**




విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ కళాభారతి స్థాపించి 40 వసంతాలు అయింది. త్యాగరాజ స్వామి భక్తుడైన సుసర్ల సూర్య భగవత్ శంకర శాస్త్రి సంకల్పంతో విశాఖలో ఒక సాంస్కృతిక కేంద్రం ఉండాలని అది నెరవేర్చే దిశలో సి.ఎస్.ఎన్. రాజు, గోపాల్ శాస్త్రి, డివి సుబ్బారావు, వి.సీతారామయ్య, జోగారావు వంటి పెద్దలు ట్రస్టుగా ఏర్పడి నిర్మించిన కళాక్షేత్రమే ఈ కళాభారతి. అప్పటి నుంచి ఇప్పటి వరకు కొన్ని వేల కచేరీలు, నృత్య కార్యక్రమాలు, నాటకాలు, సాహితీ కార్యక్రమాలు, హరికథలు, బుర్రకథలు, త్యాగరాజ ఉత్సవాలు , వాగ్గేయ కార్ల ఉత్సవాలు ఈ వేదికపై నిర్వహించారు. భారతరత్నలు, పద్మ విభూషణలు, పద్మభూషణలు, పద్మశ్రీలు, సంగీత కళానిధులు, ఇంకా ప్రపంచవ్యాప్తి చెందిన ప్రఖ్యాత కళాకారులు ఈ వేదికపై ప్రదర్శనలు ఇచ్చి విశాఖ కళాభారతి ద్వారా కళలకి కేంద్రం అయింది. విశాఖ వాసులందరికీ అటువంటి కళాకారుని పరిచయం చేసే భాగ్యం కళాభారతి ట్రస్ట్ వారికి దక్కింది అని కళాభారతి అధ్యక్షులు మంతెన సత్యన్నారాయణ రాజు, కార్యదర్శి శ్రీ రామదాస డాక్టర్ రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు దశాబ్దాలు నిండిన కళాభారతి సంగీత సేవకు అనుగుణంగా ఆరు రోజులు పాటు అత్యంత ఉన్నత స్థాయి కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ఒడిస్సా గవర్నర్ కంభంపాటి హరి బాబు 27న జరగబోయే "నాట్య విద్యా భారతి" బిరుదు సత్కార సభకి ముఖ్యఅతిథిగా వస్తున్నారని, 26న వైస్ అడ్మిరల్ సంజయ భళ్లా ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారని తెలిపారు. ఆరు రోజుల ఉత్సవాల ఆహ్వాన పత్రికను అధ్యక్షులు ఎంఎసఎన్ రాజు , కార్యదర్శి డాక్టర్ రాంబాబు , కోశాధికారి పైడా కృష్ణ ప్రసాద్, ట్రస్టీ మల్లికా మనోజ్ గ్రంధి , ట్రస్టీ ఎస్ రామగోపాల్ , పంతుల నర్సింగరావు అండ్ మేనేజర్ మోహన్ దాస్ ఆవిష్కరించారు. మొదట రోజు 22 న ప్రఖ్యాత గాత్ర విద్వాంసురాలు, సంగీత నాటక అకాడమీ పురస్కారం రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకొని మన విశాఖకే గర్వకారణమైన కళాకారిణి డాక్టర్ పంతుల రమ గాత్ర కచేరితో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 23న సంస్కార భారతి విజయ వాడ వారు "జయహో శ్రీ చత్రపతి శివాజీ మహారాజ" చారిత్రాత్మక నాటకాన్ని 60 మంది కళాకారులతో అత్యంత భారీ సెట్టింగ్లతో ప్రదర్శించబోతున్నారని అన్నారు. 24న ప్రఖ్యాత హిందుస్తానీ విద్వాంసులు ,ఢిల్లీ, కాశ్మీర్, కలకత్తా నుంచి వచ్చి హిందుస్తానీ గాత్ర అండ్ సరోద్ వాయిద్య జుగల్బంది కచేరి చేయబోతున్నారన్నారు. 25న ప్రపంచ ఖ్యాతిగాంచిన ప్రఖ్యాత గాత్ర విద్వాంసులు త్రిచూర్ బ్రదర్స్ చెన్నై నుంచి వచ్చి అద్భుత కచేరి నిర్వహించనున్నారన్నారు . 26న సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత విద్వాన్ మైసూర్ మంజునాథ్, వారి కుమారుడు విద్వాన్ సుమన్ మంజునాథ్ కలిసి వైలెన్ ద్వయం కచేరి ఉంటుందన్నారు. ఆఖరి రోజు 27న సాయంత్రం 6:30 గంటలకు విఎండిఏ ప్రతిష్టాత్మకంగా ఇచ్చే వార్షిక బిరుదు ప్రధానం "నాట్య విద్యా భారతి" బిరుదును 84 ఏళ్ల భరతనాట్య కళాకారిణి , పద్మ విభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ పద్మ సుబ్రహ్మణ్యంకి ప్రధానం చేయనున్నామని,, ముఖ్యఅతిథిగా డాక్టర్ కే హరి బాబు ద్వారా ప్రధానోత్సవం జరుగుతుందని, అలాగే రెండున్నర లక్షలు విలువ చేసే వైభవ్ జ్యువెలర్స్ స్పాన్సర్ చేస్తున్న "స్వర్ణకమలం", లక్ష రూపాయల నగదు బహుమతి ,ప్రశంసా పత్రం, నూతన వస్త్రాలు, కర్పూర మాలలతో పురస్కార గ్రహీతను ఘనంగా సత్కరించనున్నామని అన్నారు.

# ఏఎస్ఆర్ ఎయిర్‌పోర్టులో వాణిజ్య సందడి...!

### గేట్‌వే ఆఫ్ ది ఈస్ట్ ఇక విమానయానానికి సిద్ధం... స్వాగతించిన విమానాయాన మంత్రి రామ్మోహన్ నాయుడు







**విశాఖపట్నం/విజయనగరం, ఆగస్టు 17, జయ జయహే**

జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ అభివృద్ధి చేసిన అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం సోమవారం నుంచీ వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించింది. దీంతో ఉత్తర ఆంధ్రప్రదేశ్‌లో కనెక్టివిటీ, ఆర్థిక అవకాశాలు, ప్రాంతీయ అభివృద్ధిలో నూతన శకం ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ విమానయాన రంగంలో ఇది ఒక కీలక మైలురాయిగా నిలిచింది. దేశీయ, అంతర్జాతీయ విమాన ప్రయాణాలకు రాష్ట్రాన్ని తూర్పు ముఖద్వారం గా మరింత బలోపేతం చేస్తోంది. విమానాశ్రయం వాణిజ్య కార్యకలాపాల ప్రారంభం పలు చారిత్రాత్మక తొలి విమాన సర్వీసులతో ఘనంగా జరిగింది. దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసుల ద్వారా విశాఖపట్నం భారతదేశంలోని కీలక నగరాలతో పాటు మధ్యప్రాచ్యం, ఆగ్నేయాసియాలోని ముఖ్య గమ్యస్థానాలకు అనుసంధానమైంది. ఈ తొలి విమాన సర్వీసులు ఉత్తర ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచంతో అనుసంధానించే వ్యూహాత్మక విమానయాన కేంద్రంగా విమానాశ్రయం సిద్ధంగా ఉందని చాటిచెప్పాయి. పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు, విమానాశ్రయ వర్గాలకు చెందిన భాగస్వాములతో కలిసి ఈ చారిత్రాత్మక మైలురాయి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా, తొలి ఇండిగో మరియు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాల్లో ప్రయాణించే ప్రయాణికులకు ఆయన లాంఛనంగా బోర్డింగ్ పాస్‌లను అందజేశారు. అలాగే, విమానాశ్రయ కార్యకలాపాల ప్రారంభానికి గుర్తుగా జ్ఞాపికలను అందజేశారు. రోజులో తొలి రాక విమానాలుగా వచ్చిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఎయిర్ ఇండియా, ఇండిగో, స్కూట్, ఇండియా వన్ విమానాలకు సంప్రదాయబద్ధమైన వాటర్ క్యానన్ సెల్యూట్‌తో స్వాగతం పలికారు. ఇది ప్రాంతీయ విమానయానంలో నూతన అధ్యాయానికి నాంది పలికిన వేడుకగా నిలిచింది. తొలి రోజున 52 ఎయిర్ ట్రాఫిక్ మూవ్‌మెంట్స్ నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించడంతో, విమానాశ్రయం సందడిగా మారి తన కార్యకలాపాల ప్రయాణాన్ని ఉత్సాహభరితంగా ప్రారంభించింది. జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్-పోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కన్వర్‌బీర్ సింగ్ కల్రా మాట్లాడుతూ, "అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో వాణిజ్య కార్యకలాపాల ప్రారంభం ఉత్తర ఆంధ్రప్రదేశ్‌కు ఒక పరివర్తనాత్మక ఘట్టం. ఇది ఈ ప్రాంత కనెక్టివిటీ ప్రయాణంలో ఒక నూతన అధ్యాయానికి నాంది. మా బృందాలు, భాగస్వాములు సంవత్సరాలుగా చేసిన సమగ్ర ప్రణాళిక, ఇంజినీరింగ్ నైపుణ్యం, నియంత్రణ నిబంధనల అమలు, కార్యకలాపాల సన్నద్ధతకు ఇది ప్రతిబింబం. విమానాశ్రయం ద్వారా ఈ ప్రాంతానికి సేవలు అందించడం ప్రారంభిస్తున్న సందర్భంగా తొలి ప్రయాణికులు, విమానయాన భాగస్వాములకు స్వాగతం పలకడం ఎంతో ఆనందంగా ఉంది. సురక్షితమైన, సౌకర్యవంతమైన, ప్రపంచ స్థాయి ప్రయాణ అనుభవాన్ని అందించేందుకు మేము కట్టుబడి ఉన్నాము. ఈ విమానాశ్రయం నుంచి కనెక్టివిటీని మరింత విస్తరించేందుకు కృషి చేస్తాము. వాణిజ్యం, పర్యాటకం, పెట్టుబడులు, ఉపాధికి ఈ విమానాశ్రయం శక్తివంతమైన ఉత్ప్రేరకంగా నిలుస్తుంది. అదే సమయంలో ప్రాంతీయ, అంతర్జాతీయ కనెక్టివిటీని బలోపేతం చేస్తూ, ఉత్తర ఆంధ్రప్రదేశ్ దీర్ఘకాలిక ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుంది" అని ఆయన తెలిపారు. ఏటా ప్రారంభంగా 60 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యంతో రూపొందించిన ఈ విమానాశ్రయాన్ని దశలవారీ విస్తరణకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ చేశారు. భవిష్యత్తులో ఏటా 4 కోట్లకు పైగా ప్రయాణికులను నిర్వహించేలా విస్తరించేందుకు అవకాశం ఉంది. 3,800 మీటర్ల కోడ్ 4జు రన్‌వే వైడ్-బాడీ విమానాలను సైతం నిర్వహించగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇది భవిష్యత్తులో దేశీయ, అంతర్జాతీయ విమాన కనెక్టివిటీ విస్తరణకు తోడ్పడటంతో పాటు, విమాన కార్గో సామర్థ్యాలను బలోపేతం చేసి, భారత తూర్పు తీరంలో ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రధాన విమానయాన మరియు లాజిస్టిక్స్ హబ్‌గా మరింత స్థిరపరచనుంది.



# అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి జోన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించడానికి విచ్చేసిన విశాఖ జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అలాగే చేపట్టవలసిన పనులను ముఖ్యమైన అభివృద్ధి పనులను అనకాపల్లి జీవీఎంసీ అధికారులు ఆయనకు తెలియజేయడం జరిగింది అలాగే కూటమి నాయకులు కూడా ఆయన కలిసి అభివృద్ధి పనులు రక్షణ చర్యలు చేపట్టాలని కూటమి నాయకులు విజ్ఞప్తి చేయడం జరిగింది కమిషనర్ దృష్టికి ప్రధానంగా క్రింది అభివృద్ధి పనులను వారి దృష్టికి తీసుకు వెళ్తూ ఎన్టీఆర్ విగ్రహం ఫుల్ బాగ్ నూకాంబిక ఆలయం రోడ్డు తోటాడ జంక్షన్ బైపాస్ రోడ్డు వరకు రహదారి 50 అడుగులకు విస్తరించడంతోపాటు ఫుల్ బాగ్ రోడ్డు నుంచి వంద పడకల ఆసుపత్రి వరకు రహదారిని విస్తరించాలని జీవీఎంసీ భవనం పాత ప్రభుత్వ ఆసుపత్రి స్థలంలోని కంపోస్టు యార్డును మరో ప్రాంతానికి తరలించి అక్కడ ఆధునిక జీవీఎంసీ కార్యాలయ భావన నిర్మించాలని విశాఖ నుంచి అనకాపల్లి వచ్చే బైపాస్ కూడలి నాగులపల్లి కోడలను ఆధునికంగా అభివృద్ధి చేసే సుందరీకరించాలని పట్టణంలోని పలు రోడ్లు కాలువలను నిర్మించి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని జీవంశ పరిధిలోని పార్కులను ఆధునికరించి లైటింగ్ తాగునీటి సదుపాయము చిన్నారుల ఆట పరికరాలు ఏర్పాటు చేయాలని జీవించే విలీన గ్రామాల్లోని రాజుపాలెం చెరువును అభివృద్ధి చేసి చెరువుగట్టు సుందరీ కరణ ఉంది లైటింగ్ వాకింగ్ ట్రాక్ పిల్లల ఆట పరికరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని 83 వ వార్డు ఏ ఎంసీ కాలనీలోని భవనాలకు మరమ్మతులు చేపట్టి అక్కడ నివసిస్తున్న గృహ యజమానులను పేర్లపై మున్సిపల్పాన్ని విధించి ఆ ప్రాంతాన్ని సుందరీకరించాలని జీవీఎంసీ పరిధిలో నిరుపయోగంగా ఉన్న వాణిజ్య సముదాయాలు కల్యాణ మండపాలకు వేలం నిర్వహించి వినియోగంలోకి తీసుకురావాలని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో చిన్నారుల కోసం ఆట పరికరాలు ఏర్పాటు చేయాలని అలాగే జీవంస్ పరిధిలో సులభ కాంప్లెక్సును ఆధునికరించే వాటిని పూర్తి చేయాలని ఎలా పలు అంశాలపై సమగ్రంగా పరిశీలించి త్వరలోనే అభివృద్ధి పనులను చేపట్టెందుకు నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ కూటమి నాయకులకు హామీ ఇవ్వడం జరిగింది




# యూత్ హాస్టల్స్ రాష్ట్ర చైర్మన్‌గా రవిపాల్

**విశాఖపట్నం (జయ జయహే)**

యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ చైర్మన్ గా సిహెచ్ రవి పాల్ ఎన్నికయ్యారు బీచ్ రోడ్ లోని యూత్ హాస్టల్స్ భవనంలో ఆదివారం జరిగిన రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు వరుసగా రెండవసారి చైర్మన్ గా పోటీ చేసిన చీమల రవి పాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.. అధ్యక్షునిగా- డాక్టర్ వర్మ, ఉపాధ్యక్షులుగా ఎ.పుండరీకాక్ష, ఎన్. మల్లిఖార్జునరావు, జె.మధుసూధనరావు, కోశాధికారిగా వి.వి.వి. ఎన్. జగపతి రాజు, కార్యదర్శిగా కె.వి.ఈ. ప్రసాద్ నిర్వాహక కార్యదర్శిగా బర్రి ఉమామహేశ్వరరావు, ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం మూడేళ్లపాటు పదవిలో ఉంటుంది. ఎన్నికల పరిశీలకులుగా తెలంగాణ యూత్ హాస్టల్స్ అసోసియేషన్ చైర్మన్ వెంకట్ యాదవ్ హాజరయ్యారు. నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ అనంతరం వివిధ కమిటీలను నియమించింది.

# ప్రియాంక హత్యపై అసెంబ్లీలో చర్చ జరపాలి: మార్గాని భరత్

**రాజమహేంద్రవరం,: జయ జయహే: ఆగస్టు 17:**




మెడికో విద్యార్థిని ప్రియాంక హత్య కేసుపై రాష్ట్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మాజీ ఎంపి , వైసిపి జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ డిమాండ్ చేశారు. ఈ కేసుపై అసెంబ్లీ, శాసన మండలిలో ప్రత్యేకంగా చర్చ నిర్వహించాలని కోరారు. కేసు నమోదు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రకాశం నగర్ సీఐపై ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఆగస్టు 3వ తేదీ రాత్రి నుంచి నిందితుల సెల్‌ఫోన్ సిగ్నల్స్‌ను పూర్తిస్థాయిలో ట్రేస్ చేసి వాస్తవాలను బయటపెట్టాలని, తిలక్ రోడ్ ప్రాంతంలో వారి సంచారం జరిగినట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. నిందితులను ఎవరైనా ప్రభావశీలులు కాపాడుతున్నారా అనే కోణంలో కూడా విచారణ జరగాలని డిమాండ్ చేశారు. నిందితులను అదుపులోకి తీసుకున్న తర్వాత అరెస్టు చూపడంలో జాప్యం ఎందుకు జరిగిందో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ప్రశ్నించారు.డాక్టర్ ప్రియాంకకుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు వైసిపి పోరాటం కొనసాగిస్తుందని భరత్ తెలిపారు. రాష్ట్రంలో మరో యువతికి ఇలాంటి దారుణం జరగకుండా నిందితులతో పాటు వారికి సహకరించిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# జెన్ జెడ్: భారత రాజకీయ భవిష్యత్తును తీర్చిదిద్దే తరం

(ప్రతాప్)

**భారత రాజకీయాల్లో జెన్ జెడ్ వైపు రాజకీయ పార్టీల దృష్టి క్రమంగా పెరుగుతోంది. యువజన విభాగాల కార్యక్రమాలు, డిజిటల్ ప్రచారాలు, యువతతో ప్రత్యక్ష సంభాషణలు, సామాజిక మాధ్యమాల్లో ప్రత్యేక కంటెంట్ ద్వారా ఈ తరాన్ని చేరుకునే ప్రయత్నాలు కనిపిస్తున్నాయి. ఇది కేవలం ఎన్నికల అవసరంతో ఏర్పడిన పరిణామం కాదు. దేశ జనాభా నిర్మాణం, సాంకేతిక పరిజ్ఞానం, మారుతున్న ఉద్యోగ మార్కెట్, సమాచార వినియోగ విధానాలు కలిసి భారత రాజకీయాల స్వభావాన్ని కూడా మార్చుతున్నాయి.**



జెన్ జెడ్ సంఖ్యాపరంగా కూడా కీలకమైన యువ ఓటర్ల సమూహం. భారతదేశంలో జెన్ జెడ్‌కు ఒకే అధికారిక వయోపరిమితి నిర్వచనం లేకపోవడంతో ఖచ్చితమైన సంఖ్య మారవచ్చు. అయితే 18--29 ఏళ్ల యువ ఓటర్లను తీసుకుంటే, 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో వారు దేశంలోని మొత్తం ఓటర్లలో 22.78 శాతం ఉన్నారని ఎన్నికల సంఘం గణాంకాలు చెబుతున్నాయి. అంటే 96.88 కోట్ల మొత్తం



నమోదిత ఓటర్లలో దాదాపు 22 కోట్లు 18--29 ఏళ్ల వయసు గలవారు. ఇది ఎన్నికల పరంగా ఎంతటి ప్రభావవంతమైన జన సమూహమో స్పష్టంగా చూపిస్తుంది.

అయితే వారి ప్రాధాన్యత కేవలం సంఖ్యలో లేదు. డిజిటల్ వేదికలతో సహజమైన అనుబంధం ఉన్న ఈ తరం ఒక సమస్యను వేగంగా తెలుసుకోవడం, వివిధ అభిప్రాయాలను పోల్చుకోవడం, ప్రశ్నించడం, తన అభిప్రాయాన్ని విస్తృతంగా పంచుకోవడం చేయగలదు. అందువల్ల రాజకీయ పార్టీలకు యువతతో సంప్రదింపులు కేవలం ప్రచార కార్యక్రమంగా కాకుండా, భవిష్యత్ విధానాలపై అవగాహన పొందే మార్గంగా కూడా మారుతున్నాయి.

జెన్ జెడ్ ప్రాధాన్యత ఇక్కడితో ముగియదు. ఉద్యోగాలు, నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, సాంకేతిక అవకాశాలు, జీవన వ్యయం, పర్యావరణ పరిరక్షణ, ప్రజా రవాణా, డిజిటల్ సేవలు వంటి అంశాలు వారి భవిష్యత్తుతో నేరుగా ముడిపడి ఉన్నాయి. ఈ అంశాలపై యువత నుంచి వచ్చే ప్రశ్నలు రాజకీయ పార్టీలను మరింత స్పష్టమైన విధానాలను రూపొందించే దిశగా ప్రోత్సహించగలవు.

భారత రాజకీయ భవిష్యత్తును జెన్ జెడ్ అనేక విధాలుగా ప్రభావితం చేయగలదు. మొదటగా, సమస్యల ఆధారిత రాజకీయ చర్చను బలోపేతం చేయవచ్చు. రెండవది, సమాచారాన్ని పరిశీలించే అలవాటుతో బాధ్యతాయుతమైన ప్రజా సంభాషణకు దోహదపడవచ్చు. మూడవది, రాజకీయాల్లో యువ నాయకత్వానికి కొత్త అవకాశాలను తెరవవచ్చు. నాలుగవది, సాంకేతికతను ఉపయోగించి ప్రజలు, పాలనా వ్యవస్థ మధ్య మెరుగైన అనుసంధానానికి సహకరించవచ్చు. ముఖ్యంగా స్థానిక సమస్యలను డిజిటల్ వేదికల ద్వారా సమర్థంగా ప్రస్తావించడం ద్వారా ప్రజాస్వామ్య భాగస్వామ్యాన్ని మరింత విస్తరించగలదు.

మరో ముఖ్యమైన మార్పు రాజకీయ ప్రతినిధిత్వంలో రావచ్చు. యువత కేవలం ఓటు వేసే వర్గంగా కాకుండా స్థానిక సంస్థల నుంచి శాసనసభలు, పార్లమెంటు వరకు ప్రజా జీవితంలోకి ప్రవేశిస్తే విధాన చర్చల్లో కొత్త అనుభవాలు, సాంకేతిక అవగాహన, సమకాలీన సమస్యలపై కొత్త దృష్టికోణాలు చేరవచ్చు. ఈ ప్రక్రియ క్రమంగా భారత రాజకీయాల్లో తరాల మధ్య సమతుల్యతను పెంచగలదు.

అయితే జెన్ జెడ్ రాజకీయ ప్రభావం ఆరోగ్యకరంగా ఉండాలంటే సమాచారాన్ని పరిశీలించడం, విభిన్న అభిప్రాయాలను గౌరవించడం, సామాజిక మాధ్యమాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించడం కూడా అంతే అవసరం. వైరల్ కంటెంట్‌ను నిజమైన సమాచారంగా భావించకుండా వాస్తవాలను నిర్ధారించుకోవడం, వ్యక్తుల కంటే విధానాలను పరిశీలించడం, తక్షణ స్పందన కంటే దీర్ఘకాలిక ప్రయోజనాలను ఆలోచించడం ప్రజాస్వామ్యానికి విలువైన సహకారం అవుతుంది.

అందుకే రాజకీయ పార్టీలు జెన్ జెడ్‌ను కేవలం ఓటర్లుగా చూడకుండా, రేపటి విధాన రూపకర్తలు, పారిశ్రామికవేత్తలు, ప్రజా ప్రతినిధులు, సామాజిక నాయకులుగా చూడాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో జెన్ జెడ్ కూడా రాజకీయాలను కేవలం ఎన్నికల సమయంలో జరిగే ప్రక్రియగా కాకుండా నిరంతర ప్రజా భాగస్వామ్యంగా చూడాలి.

జెన్ జెడ్ రాజకీయాల్లోకి రావడం కంటే ముఖ్యమైనది, రాజకీయాల నాణ్యతను ప్రభావితం చేసే స్థాయికి ఎదగడం. ప్రశ్నించే యువత, బాధ్యతగా ఆలోచించే యువత, సమాచారాన్ని పరిశీలించే యువత, పరిష్కారాలను సూచించే యువత పెరిగితే భారత ప్రజాస్వామ్యం మరింత చైతన్యవంతంగా మారుతుంది. భవిష్యత్ భారత రాజకీయాలను ఎవరు నడిపిస్తారన్నదానికంటే, ఏ విలువలతో, ఏ ప్రాధాన్యతలతో, ఏ విధమైన ప్రజా భాగస్వామ్యంతో నడుస్తాయన్నదే కీలకం. ఆ భవిష్యత్తును తీర్చిదిద్దే అవకాశం జెన్ జెడ్ చేతుల్లోనే ఉంది.



## పతకాల నుంచి పునాది దిశగా
# భారత క్రీడా ప్రస్థానం

సీహెచ్ ప్రతాప్

**గ్లాస్గోలో ముగిసిన 2026 కామన్వెల్త్ క్రీడలు భారత క్రీడా రంగానికి ఒక ముఖ్యమైన సందేశాన్ని అందించాయి. జూలై 23 నుంచి ఆగస్టు 2 వరకు జరిగిన ఈ పోటీల్లో 74 దేశాలు పాల్గొన్నాయి. కేవలం పది క్రీడాంశాలకే పరిమితమైన ఈ క్రీడల్లో ఆరు పారా క్రీడాంశాలను కూడా పూర్తిగా కలిపారు. భారత బృందం 39 పతకాలతో నాలుగో స్థానంలో నిలిచింది. ఇందులో 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్యాలు ఉన్నాయి. ముఖ్యంగా కుస్తీ, షూటింగ్ వంటి గతంలో భారత్‌కు అధిక పతకాలు అందించిన క్రీడాంశాలు ఈసారి లేకపోయినా ఈ స్థాయి ప్రదర్శన రావడం ప్రతిభ విస్తరిస్తున్నదానికి సంకేతం.**

అయితే పతకాల సంఖ్యతోనే భారత క్రీడల భవిష్యత్తును అంచనా వేయడం సరైంది కాదు. 2014 గ్లాస్గోలో భారత్ 64, 2018 గోల్డ్‌కోస్ట్‌లో 66, 2022 బర్మింగ్‌హామ్‌లో 61 పతకాలు సాధించింది. ఈ గణాంకాలు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి---అంతర్జాతీయ స్థాయిలో నిలకడైన విజయాల కోసం ఒక్కో ప్రతిభావంతుడిపై ఆధారపడకుండా నిరంతర ప్రతిభా సరఫరా వ్యవస్థను నిర్మించాలి.

భారత క్రీడల తదుపరి దశ 'పతక విజేతల తయారీ' నుంచి 'క్రీడా వ్యవస్థ నిర్మాణం' వైపు సాగాలి. ఐదు నుంచి పదిహేనేళ్ల పిల్లల స్థాయిలో శాస్త్రీయ ప్రతిభా గుర్తింపు కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించాలి. ప్రతి జిల్లాలో శారీరక సామర్థ్యం, వేగం, బలం, సమన్వయం, సహనశక్తి ఆధారంగా ప్రతిభను గుర్తించి, సరైన క్రీడాంశంలో శిక్షణ ఇవ్వాలి.

రెండవది, ప్రతి క్రీడాకారుడికి క్రీడా శాస్త్రం అందుబాటులోకి రావాలి. పోషకాహారం, క్రీడా వైద్యం, గాయాల నివారణ, మానసిక దృఢత్వం, నిద్ర, శిక్షణ విశ్లేషణ వంటి అంశాలను సాధారణ శిక్షణలో భాగం చేయాలి. మూడవది, దేశంలోని ప్రతి రాష్ట్రంలో కనీసం కొన్ని అత్యుత్తమ క్రీడా కేంద్రాలను ఏర్పాటు చేసి, పాఠశాలలు--కళాశాలలు--జాతీయ శిబిరాల మధ్య నిరంతర ప్రతిభా మార్గాన్ని నిర్మించాలి.

నాలుగవది, మహిళలు, పారా క్రీడాకారులు, గ్రామీణ ప్రాంతాల ప్రతిభకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. ఐదవది, క్రీడాకారుల ప్రదర్శనను కేవలం పతకాలతో కాకుండా వ్యక్తిగత రికార్డు మెరుగుదల, ప్రపంచ ర్యాంకింగ్, గాయాల నియంత్రణ, దీర్ఘకాలిక స్థిరత్వం వంటి ప్రమాణాలతో అంచనా వేయాలి.

కామన్వెల్త్ క్రీడలు మనకు విజయాన్ని ఇచ్చాయి; అంతకంటే విలువైనది భవిష్యత్తుకు దిశను చూపించాయి. 2036 ఒలింపిక్స్ లక్ష్యం నిజమైన క్రీడా శక్తిగా మారాలంటే, వేదికలను నిర్మించడం కంటే ప్రతిభను నిర్మించే వ్యవస్థను నిర్మించడమే భారతదేశం ముందున్న అసలు కర్తవ్యం.

# వైద్యులకు ఒక దేశం-ఒక లైసెన్స్ (వన్ నేషన్-వన్ లైసెన్స్)

(ప్రతాప్)

**భారతదేశంలో వైద్య విద్య, వైద్య సేవలు విస్తరిస్తున్నప్పటికీ, వైద్యుల రిజిస్ట్రేషన్ విధానంలో ఉన్న కొన్ని పరిమితులు దేశవ్యాప్తంగా వైద్య సేవల సులభ లభ్యతకు అడ్డంకిగా మారుతున్నాయి. ఒక రాష్ట్రంలో నమోదైన వైద్యుడు మరొక రాష్ట్రంలో శాశ్వతంగా లేదా దీర్ఘకాలికంగా వైద్య సేవలు అందించాలంటే ఎదురయ్యే పరిపాలనా ప్రక్రియలు, వేర్వేరు రిజిస్ట్రేషన్ అవసరాలు, ధ్రువీకరణ విధానాలు వైద్యుల చలనశీలతను కొంతమేరకు పరిమితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా చెల్లుబాటు అయ్యే ఒకే వైద్య లైసెన్స్ అవసరంపై చర్చకు ప్రాధాన్యత పెరుగుతోంది.**




వైద్య వృత్తి స్వభావమే దేశవ్యాప్తంగా ఒకే ప్రమాణాలను కోరుకుంటుంది. వైద్యుడి అర్హత, నైపుణ్యం, వృత్తి నైతికత, రిజిస్ట్రేషన్ వంటి అంశాలకు జాతీయ స్థాయిలో సమాన ప్రమాణాలు ఉన్నప్పుడు, వైద్యుడు ఏ రాష్ట్రంలో పనిచేసినా




రోగికి అందే సేవల నాణ్యతపై విశ్వాసం పెరుగుతుంది. ఇప్పటికే జాతీయ వైద్య కమిషన్ దేశవ్యాప్తంగా వైద్య విద్య, వృత్తి ప్రమాణాలు, వైద్యుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఏకీకృత వ్యవస్థను అభివృద్ధి చేసే దిశగా పనిచేస్తోంది.

ఒక దేశం--ఒక లైసెన్స్ విధానం అమలైతే వైద్యుల భౌగోళిక చలనశీలత గణనీయంగా పెరగవచ్చు. వైద్యుల కొరత ఉన్న ప్రాంతాలకు అవసరమైన నిపుణులు త్వరగా వెళ్లే అవకాశం ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలు, మహమ్మారులు, అత్యవసర ఆరోగ్య పరిస్థితులు ఏర్పడినప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి వైద్యులను వేగంగా సేవలకు వినియోగించుకోవచ్చు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన, దూర ప్రాంతాల్లో వైద్య నిపుణుల లభ్యతను పెంచేందుకు ఇది ఉపయోగపడే అవకాశం ఉంది.

ఇదే సమయంలో దేశంలో వైద్యుల సమాన పంపిణీకి కూడా ఈ విధానం తోడ్పడవచ్చు. ప్రస్తుతం మెరుగైన మౌలిక సదుపాయాలు, అధిక ఆదాయ అవకాశాలు ఉన్న నగరాల్లో వైద్యుల కేంద్రీకరణ ఎక్కువగా కనిపిస్తుంది. ఒకే జాతీయ లైసెన్స్‌తో ఆసుపత్రులు, వైద్య సంస్థలు ఇతర రాష్ట్రాల నుంచి నిపుణులను సులభంగా నియమించుకునే అవకాశం పెరిగితే, వైద్య సేవల భౌగోళిక అసమానతలను కొంతవరకు తగ్గించవచ్చు. అయితే దీనికి మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రోత్సాహకాలు కూడా సమాంతరంగా అవసరం.

అయితే ఒకే లైసెన్స్ అంటే నియంత్రణలు తొలగించడం అని అర్థం కాదు. వైద్యుల అర్హతలను ధ్రువీకరించడం, నిరంతర వృత్తిపరమైన విద్యను నిర్ధారించడం, వైద్య నైతిక ప్రమాణాలను పాటించేలా చూడడం, ఫిర్యాదులపై సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం వంటి బాధ్యతలు మరింత బలపడాలి. రాష్ట్రాల ఆరోగ్య వ్యవస్థల ప్రత్యేక అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

డిజిటల్ సాంకేతికత ఈ విధానానికి కీలక ఆధారంగా మారవచ్చు. ఒకే జాతీయ డిజిటల్ రిజిస్టర్‌లో వైద్యుడి అర్హతలు, రిజిస్ట్రేషన్, నైపుణ్యాలు, వృత్తిపరమైన స్థితి వంటి వివరాలు భద్రంగా అందుబాటులో ఉంటే, రోగులు, ఆసుపత్రులు, నియంత్రణ సంస్థలకు ధ్రువీకరణ ప్రక్రియ సులభమవుతుంది. అదే సమయంలో వ్యక్తిగత సమాచార భద్రత, డేటా గోప్యతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలి.

అందువల్ల ఒక దేశం--ఒక వైద్య లైసెన్స్ అనేది కేవలం పరిపాలనా సంస్కరణగా చూడకూడదు. ఇది వైద్యుల స్వేచ్ఛాయుత చలనశీలత, అత్యవసర ఆరోగ్య సేవల సమర్థత, వైద్య నిపుణుల సమాన పంపిణీ, రోగులకు మెరుగైన సేవలు అందించే దిశగా తీసుకునే నిర్మాణాత్మక అడుగుగా చూడాలి. జాతీయ ప్రమాణాలు, రాష్ట్రాల అవసరాలు, రోగుల భద్రత---ఈ మూడింటి మధ్య సమతుల్యతను కాపాడుతూ విధానాన్ని రూపొందిస్తే, దేశవ్యాప్తంగా మరింత సమర్థవంతమైన ఆరోగ్య వ్యవస్థకు ఇది బలమైన పునాదిగా మారగలదు.



## ఉగాది ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుద్ధ పశుపతి రావు మెమోరియల్ అవార్డ్స్ ప్రధానోత్సవం

**మునగపాక, ఆగస్టు 17, జయ జయహే:**

సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తోటాడ నందు స్వర్గీయ బుద్ధ పశుపతి రావు గారి జ్ఞాపకార్థం వారి కుమారుడు బుద్ధ పురోగామి ఉగాది ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుద్ధ పశుపతి రావు మెమోరియల్ అవార్డ్స్ ప్రధానోత్సవం జరిగింది. మార్చి 2026 పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో మునగపాక మండలంలో మొదటి స్థానం సాధించిన తోటాడ హై స్కూల్ విధార్థిని లావేటి హరిణి, 10,000/- నగదు బహుమతి మరియు మెమంటో అందచేశారు. అలాగే జిల్లా పరిషత్ హై స్కూల్ ఫస్ట్ వచ్చినందుకు మరొక 10,000/- నగదు బహుమతి మరియు మెమంటో అందచేశారు. అలాగే హై స్కూల్ సెకండ్ వచ్చిన పప్పు ప్రణవ్ కు 5000/- నగదు బహుమతి మరియు మెమంటో అందచేశారు. హై స్కూల్ థర్డ్ వచ్చిన కోయిలాడ పృథ్వీ కి 3000/- నగదు బహుమతి మరియు మెమంటో అందచేశారు. మరొక ఇద్దరు స్టూడెంట్స్ కు మెరిట్ నీడ్ విభాగంలో బొడ్డేడ స్నేహిత, చొప్ప రేష్మ లకు 3000/- చొప్పున నగదు బహుమతి మరియు మెమంటో అందచేశారు. అలాగే గత విద్య సంవత్సరశీ లో 6వ, 7వ, 8వ, 9వ తరగతి లో మొదటి స్థానం లో నిలిచిన స్టూడెంట్స్ పెంటకోట శశిధర్, మత్తుర్తి తనీష్, పెంటకోట భావన, కొమ్మోజు గోపిక రేష్మ లకు 2000/- చొప్పున నగదు బహుమతి మరియు మెమంటో అందచేశారు. సుమారుగా 50,000/- స్కాలర్షిప్ లు అందచేశారు. అలాగే పదవ తరగతి లో మండల ఫస్ట్ వచ్చినందుకు తోటాడ హై స్కూల్ కు 25,000/- నగదు బహుమతి ఇచ్చారు. అలాగే పదవ తరగతి మంచి ఫలితాలు తెచ్చినందుకు ప్రధానోపాధ్యాయురాలు కోట్ని రామలక్ష్మిని సత్కరించారు. మండల ఫస్ట్ సాధించిన విద్యార్థిని లావేటి హరిణి తల్లి తండ్రులు లావేటి శ్రీనివాస్, సత్యవతి లను కూడా పురోగామి సత్కరించారు. విద్యార్థులు బాగా చదివి వచ్చే సంవత్సరం కూడా ఇలాంటి ఫలితాలు తీసుకొని రావాలని పురోగామి కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎమ్సి చైర్మన్ కరణం సంతోష్, కో ఆప్టెడ్ సభ్యులు మరియు కూటమి నాయకులు దొడ్డి రమేష్, మత్తుర్తి త్రినాథ్ మరియు బుద్ధ రమేష్, పాలమరశెట్టి ప్రసాద్, పురోగామి కుటుంబ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్‌లో రెవెన్యూ... టౌన్‌ప్లానింగ్ సర్వేల మధ్య భారీ తేడా





- సరిహద్దు వివాదాల పరిష్కారంలో జీవీఎంసీ దూరం
- నష్టపోయిన వారికి మొండి చేయి చూపుతున్న ప్లానింగ్
- న్యాయం చేయాలన్న సీనియర్ కూటమి నేత కళ్లేపల్లి సీతారామ రాజు

**విశాఖపట్నం, ఆగష్టు 17, జయ జయహే :**

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్షమో...అవినీతో కారణము తెలియదు కానీ 27వ వార్డు ప్రస్తుత సౌత్ నియోజకవర్గ పరిధిలో గల శ్రీనగర్ రాజేంద్రనగర్‌లో ఉన్నటువంటి బ్లాక్ నెంబర్ 24 టౌన్ సర్వే నెంబర్ 688ఏ , టౌన్ ప్లానింగ్ నెంబర్ 20/54 లేఔట్ ప్లాన్‌లో రోడ్లు, పార్కు కొరకు 6 ప్లాట్‌లకు చెందిన స్థలాల యజమానుల పరిస్థితి గందరగోళంగా ఉందని సీనియర్ కూటమి నాయకులు కళ్లేపల్లి వెంకట సీతారామ రాజు అన్నారు. శ్రీనగర్‌లోని శ్రీ మహారాజ ఇన్ హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్‌లో కొందరు భవన నిర్మాణదారులలో 9 భవనములకు వందల కోట్లు రూపాయలు చేతులు మారినట్టు తెలుస్తోందని ఆరోపించారు. లేనిది ఉన్నట్టుగా...ఉన్నది లేనట్టుగా దిక్కులు మార్చేసి...రోడ్లు...పార్కు స్థలాలకు సైతం అధికారులు ప్లాన్‌లు మంజూరు చేయడం వెనక పెద్ద కుట్రే జరిగిందన్నారు. జీవీఎంసీ ప్లానింగ్ అధికారుల మామళ్ల మత్తు కారణంగా ఇదే ప్రాంతంలో మాజీ కార్పోరేటర్ కళ్లేపల్లి విజయ లక్ష్మికి చెందిన ప్లాట్లతో పాటు అనేక మంది తీవ్రంగా నష్టపోయారని దుయ్యబట్టారు. మంచి ప్రాంతంలో స్థలం కొనుక్కుంటే అన్ని వసతులుంటాయని ఆశపడితే ఆ ఆశలను జీవీఎంసీ నీరుగార్చిందని విమర్శించారు. ఈ ప్రాంతంలో ప్లాట్లు కొనుక్కున్నవారికి బ్యాంకులు లోన్ ఇవ్వక, తనకా పెడదామని ప్రయత్నించిన, మా అవసరము నిమిత్తము ప్లాట్‌ని అమ్ముకుని కూతురికి వివాహము చేసి అత్తవారింటికి పంపిద్దామనుకున్న నిబంధనలు మాలాంటి సామాన్యులకు అడ్డుపడుతున్నాయని చెప్పారు. ఆ ప్లాట్‌లను అమ్మేందుకు వీలు లేకుండా ప్రభుత్వ వారి భూమిగా యూఎల్‌సీ 22ఏ (స్లాటర్ హౌస్) జాబితాలో ఉన్నది అని రిజిస్టర్ కార్యాలయము వారు, ఈ సర్వే నెంబరుకు మీరు ఎనఓసీ తెచ్చుకుంటే రిజిస్ట్రేషన్ అవుతుందని లేదంటే అవ్వదని తేల్చిచెబుతుంటే దాని కొరకు మండల సర్వే, టౌన్ సర్వే, కార్యాలయాలు చుట్టూ ఏళ్ల తరబడి తిరిగినా, భారీ మొత్తములో ముడుపులు తీసుకొని ఎనఓసీ ఇస్తున్నా... వాటివల్లన రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి కానీ తదుపరి బ్యాంకు రుణములకు, అమ్ము కొనుటకు చాలా ఇబ్బందులు పడుతూ ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ ప్రదర్శనలు చేస్తూనే ఉన్నామని పేర్కొన్నారు. ఈ లే అవుట్లో ప్లాట్లు అని ప్రభుత్వమే ఆమోదించిన సర్వే నంబర్లు అని మేము కొనడమే మేం చేసిన తప్పా అని ప్రశ్నించారు. ఎందుకంటే ప్రభుత్వము స్థానిక ప్రజలకు మౌలిక సదుపాయాలతో పాటు, స్కూలు, పార్కులు, విశాలమైన రోడ్లు, కొరకై అన్ని పరిశీలించిన తర్వాత ఆమోదించి ఉంటారు అని ఆశించి లేఅవుట్లో గాని లేఅవుట్ పరిసర ప్రాంతాల్లో మా భవిష్యత్తు పిల్లల భవిస్యతు బాగుంటుంది అని కొనుకున్నామని, కానీ ప్రభుత్వ అధికారుల ద్వంద్వ నీతులతో తాము మోసపోయామనే బాధతో కుంగిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ సర్వేనెంబర్ 38/2 రేసపువానిపాలెం టి.పి నెం 20/54 , టౌన్ సర్వే నెం 688బి ప్లాట్ నంబర్,6, 6ఏ, 7, 8,9,11,12,13 మరియు 127,132 వేసి ఫోర్జరీ డాక్యుమెంట్లకు వత్తాసు పలుకుతున్నారని, నిషేధిత ప్రాంతములో ఉన్న సర్వే నంబర్ ప్రాపర్టీ డాక్యుమెంట్ల కు బిల్డింగ్ అనుమతులు ఏ విధముగా ఇచ్చారో కానీ ఈ భవన నిర్మాణ పనులు అల్లి పురం వార్డ్‌లో బ్లాక్ నంబర్ 24 టి.స్ నెం 688ఏ లో చేయుచున్నారని వివరించారు. రెవెన్యూ రికార్డులకు, టౌన్ రికార్డులకు మధ్య వ్యత్యాసాన్ని గ్రౌండ్ రియాలిటీ తో పాటు జీవీఎంసీ అధీనములో ఉన్న రికార్డులు కూడా పరిశీలించకుండా పెద్ద ఎత్తున లంచాలు అందుకుని గుడ్డిగా అనుమతులు మంజూరు చేయటం వలన నాకు స్థానిక ప్రజలకు మరియు ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం జరుగుతుందన్నారు. ఈ వివాదము పై అనేక రీతిలో మండల రెవెన్యూ అధికారులు, యూఎల్సీ, టౌన్ సర్వేయర్, మండల సర్వేయర్, టౌన్ ప్లానింగ్, కమిషనర్ జీవీఎంసీ, జిల్లా కలెక్టర్ వారికి ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ వాటి పై కనీసం విచారణ చేయకుండా గుడ్డిగా భూ కబ్జా దారులకు వత్తాసు పలకడము వెనుక ఎంత మొత్తములో చేతులు మారాయో ఊహించుకోవాల్సిందేనని పేర్కొన్నారు. ఈ భూ వివాదాన్ని పరిష్కరించి నిజనిజాలను వెలుగులోకి తీసుకు వచ్చి తమకు తగు న్యాయము చేయాలి అని డిమాండ్ చేశారు.



## 30 నుండి కారీరిష్టి యాగం, వరుణజపం, పర్జన్యశాంతి హోమం

**తిరుమల,ఆగస్ట్ 17,జయ జయహే.**

రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని శ్రీవారిని ప్రార్థిస్తూ ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 3వ తేదీ వరకు కారీరిష్టి యాగం, వరుణజపం, పర్జన్యశాంతి హోమాలనుటీటీడీనిర్వహించనుంది. తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 32 మంది వేద, శ్రౌత, స్మార్థపండితులు యాగ కార్యక్రమాల్లో పాల్గొంటారు. సెప్టెంబర్ 3న మహాపూర్ణాహుతి నిర్వహిస్తారు. ధర్మగిరి వేద విజ్ఞన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివ సుబ్రహ్మణ్య అవధాని ఆధ్వర్యంలో ఇందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి...




## శక్తి టీమ్ ఏఎస్సై గంగాధరరావుకు ప్రశంసా పత్రం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి వేడుకల్లో విశిష్ట సేవలు అందించిన అధికారులు, పోలీసు సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిడదవోలు పోలీస్ స్టేషన్‌కు చెందిన శక్తి టీమ్ ఏఎస్సై గంగాధరరావు విధి నిర్వహణలో అందించిన విశిష్ట సేవలను గుర్తించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. మహిళలు, బాలికల భద్రతకు సంబంధించి శక్తి టీమ్ ద్వారా చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సేవలను గుర్తిస్తూ ఈ ప్రశంసా పత్రం అందించినట్లు తెలిపారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి చేతుల మీదుగా ఏఎస్సై గంగాధరరావు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్‌తో పాటు పలువురు అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. విశిష్ట సేవలకు ప్రశంసా పత్రం అందుకోవడం పట్ల గంగాధరరావును సహచర పోలీసు సిబ్బంది అభినందించారు.




## మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన

### ఏఎస్సై గంగాధరరావు

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**


ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ ఆధ్వర్యంలో నిడదవోలు సీఐ తిలక్ సూచనలతో సమిశ్రగూడెం సచివాలయంలో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ బాలాజీ సుందరరావు, శక్తి టీమ్ ఏఎస్సై గంగాధరరావు, మహిళా కానిస్టేబుల్ శాంతి సుమారు 30 మంది ప్రజలకు మహిళలు, చిన్నారుల భద్రత, శక్తి యాప్, అత్యవసర నంబర్ 112పై అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్ట్, నకిలీ గేమింగ్, రుణ యాప్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసాలకు గురైతే 1930కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే దూరప్రాంతాలకు ప్రయాణాలు, వివాహాలు వంటి సందర్భాల్లో ఇల్లు ఖాళీగా ఉంచే సమయంలో పోలీసులకు సమాచారం అందిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా ఉచిత భద్రతా సదుపాయం కల్పిస్తామని అధికారులు తెలిపారు




## ఉత్తమ సేవా పథకంతో ఎస్సై జగన్మోహన్‌రావుకు ప్రశంసా పత్రం..

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

నిడదవోలు పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న జగన్మోహన్‌రావుకు ఉత్తమ సేవా పథకం ప్రశంసాపత్రం అందింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి చేతుల మీదుగా ఆమెకు ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రావు మాట్లాడుతూ, ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని, ప్రజలకు నిజాయితీతో, అంకితభావంతో సేవలందిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. తనకు ఈ గౌరవం దక్కేందుకు సహకరించిన ఉన్నతాధికారులు, సహచర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



**కొయ్యూరు : ( జయ జయహే ) న్యూస్ ఆగష్టు 18,**

కొయ్యూరు మరియు మంప పోలీస్ స్టేషన్లను చింతపల్లి ఎస్ డీపీవో సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్లలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, ధృవీకరించారు. స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పరిపాలన, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయడం వంటి అంశాలపై సిబ్బందికి కీలక సూచనలు మరియు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం చింతపల్లి ఎస్ డీపీవో , కొయ్యూరు సీఐ మరియు మంప ఎస్ఐ తో కలిసి మంపలోని జూనియర్ బాలుర కళాశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థులకు వివిధ ముఖ్యమైన అంశాలపై విస్తృత అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ డీపీవో మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని జీవితంలో విజయాలు సాధించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మహిళల పట్ల గౌరవభావంతో వ్యవహరించాలని, రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని పిలుపునిచ్చారు. యువతలో వ్యక్తిత్వ వికాసంతో పాటు సామాజిక బాధ్యత, చట్టపరమైన అవగాహన మరియు భద్రతా చైతన్యాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

## రైతులకు గిట్టుబాటు ధరపై గాలి మురళి నాయుడు హర్షం

**తోట్టంబేడు. ఆగస్టు 17,జయ జయహే.**

కూటమి ప్రభుత్వంలో రైతులకు, రైతే రాజు అన్న చందాన ప్రభుత్వం రైతులను గుర్తించి రైతులకు గరిష్టంగా గిట్టుబాటు ధరను కల్పించడం పట్ల పార్టీలకతీతంగా రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి కూటమి ప్రభుత్వానికి రైతులు ధన్యవాదాలు తెలియజేస్తూ, యూరియా కొరతను యాప్ లేకుండా వరి కోత యంత్రాలు, స్ప్రేయర్లు, తార్పాలిన్ పట్టలు, వ్యవసాయ పరికరాలను డిప్ ద్వారా కాకుండా అందుబాటులోకి తెస్తే రైతులు ఆనందం వ్యక్తం చేస్తారని మాజీ మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు కోరారు. గత ప్రభుత్వంలో ఎటువంటి వ్యవసాయ పరికరాలను ఇచ్చిన చరిత్ర లేదని గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎంతో మంది రైతులకు సబ్సిడీ ద్వారా వ్యవసాయ పరికరాలను ఇచ్చిన ఘనత చంద్రబాబు నాయుడు కి, దివంగత నేత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కి దక్కిందని కొనియాడారు. రైతులకు గిట్టుబాటు ధర పై గాలి మురళి నాయుడు హర్షంవ్యక్తం చేశారు.



## పాడేరులో నెలాఖరున జాబ్ మేళ

### అరకు వేలి ఎస్సై టి మల్లేశ్వరరావు

**అరకులోయ: ఆగస్టు 17. జయ జయహే.**



ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన నిరుద్యోగ యువతకు ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెలాఖరులో పాడేరు లో భారీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అరకు వేలి ఎస్సై మల్లేశ్వరరావు. తెలియజేస్తున్నారు, అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆధ్వర్యంలో ఈ ఉపాధి మేళ జరుగునుంది అని పేర్కొన్నారు. ఈ యొక్క జాబ్ మేళలో 35 ఏళ్ల లోపు వయసు ఉండి అర్హత కలిగిన యువత యువకులకు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ఎస్ఐ తెలియజేశారు. ఉద్యోగులపై ఆసక్తిగల అభ్యర్థులు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో పేర్లను నమోదు చేసుకోవాలని ఎస్ఐ తెలియజేశారు,



# చోడవరంలో పేదలకు అన్నదానం

**చోడవరం ఆగస్టు 17 జయ జయహే**

చోడవరం శివాలయం వద్ద సోమవారం చోడవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డివియం నాయుడు ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. ఏపీయూడబ్ల్యూజే 70వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక సీఐపీ అప్పలరాజు చేతుల మీదుగా ఆహార పట్టాలను పేదలకు అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి ఏపీయూడబ్ల్యూజే చేస్తున్న కృషిని సిఐ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్థానిక విలేకరులు వి జోజి, కోవెల శ్రీను, పి సతీష్, సత్యనారాయణ, డి నవ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు




## మాడుగులలో జర్నలిస్టులు

# పలు సేవా కార్యక్రమాలు

**మాడుగుల ఆగస్టు 17 జయ జయహే**

మాడుగుల ప్రెస్ ఆధ్వర్యంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే 70వ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా మాడుగుల సెయింట్ ఆన్స్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పళ్ళు రొట్టెలు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిస్టర్స్ ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అలాగే మాడుగుల ప్రభుత్వాసుపత్రిలో రోగులకు, శ్రీనివాస్ ఆసుపత్రిలో రోగులకు పళ్ళు రొట్టెలు బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కల నాటి, కేక్ కట్ చేసి రాష్ట్రపతి దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ నరేష్, డాక్టర్ విజయ రాజ్ కుమార్, డాక్టర్ ఎర్రి నాయుడు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి జయ, వైస్ ప్రిన్సిపాల్ అధ్యాపకులు రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# పంటల బీమా ఈనెల 30 వరకు పొడిగింపు

**మాడుగుల ఆగస్టు 17 జయ జయహే**



ప్రధాన మంత్రి ఫసల భీమా యోజన (పంట భీమా పథకము) ను ఈనెల 30 వరకు ప్రభుత్వం పొడిగించినట్లు మండల వ్యవసాయ అధికారిని అనసూయ సోమవారం తెలిపారు. కాబట్టి రైతులందరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.పంట భీమా నమోదు కామన్ సర్వీస్ సెంటర్ లలోనే కాకుండా గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లు కూడా నమోదు చేస్తారు కాబట్టి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.




## నర్తన నాట్యాలయ చిన్నారులకు

# నర్తనబాల అవార్డులు

**ఏలూరు,(జయ జయహే )**

అభినయ నృత్యభారతి ఏలూరు వారి ఆధ్వర్యంలో 11వ జాతీయస్థాయి నర్తనబాల అవార్డులు, అభినయ విద్యా పురస్కారాల ప్రదానోత్సవం స్థానిక వైఎంహెచ్ఎ హాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన చిన్నారులకు నర్తనబాల అవార్డులు, పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన నర్తక చిన్నారులకు అభినయ పురస్కారాలు అందించారు. ధవళేశ్వరం గ్రామానికి చెందిన నర్తన నటరాజ నాట్యాలయం నుంచి నాట్యం తో పాటు 10 వ తరగతి లో ప్రతిభను కనపర్చిన ఎం ఎన్ ఐశ్వర్య కుమారి విద్యా పూరస్కారం అందుకుంది. నర్తన బాలా అవార్డు ను ఐశ్వర్య, వర్షిణి మరియు చారస్మా లు ముగ్గురు చిన్నారులు అందుకున్నారు. ఈ కార్యక్రమం లో లయన్స్ జిల్లా గవర్నర్ డాక్టర్ డి.సుబ్బారావు, ఉపగవర్నర్ లయన్ సత్యస్వరూప్, యువజనశాఖ సీఈవో కె.ప్రభాకర్, వైఎంహెచ్ఎ కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు ఇరదల ముద్దుకృష్ణ, కార్యదర్శి మజ్జి కృష్ణ, లేళ్ల వెంకటేశ్వరావు, కేబీ రావు, శాకమూడి మురళీకృష్ణ, దువ్వి రామారావు, పుల్లాబొట్ల పురుషోత్తం చిన్నారులకు అవార్డులు అందించారు.




## ఏపీ ఈఎంజేఏ

# సేవా కార్యక్రమాలు

**చోడవరం ఆగస్టు 17 జయ జయహే**

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియ 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం చోడవరం ఎపిఈఎంజెఏ యూనియన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చోడవరం పార్కింగ్ గెస్ట్ హౌస్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం అక్కడినుండి ర్యాలీగా చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు రగ్గులు, పండ్లు, బ్రెడ్ ఒంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొని రోగులకు తమ వంతు సహాయాన్ని అందించారు. అనంతరం "చోడవరం ప్రెస్ యూనియన్ వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేశారు. జర్నలిస్టుల ఐక్యతతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామనివ యూనియన్ అధ్యక్షుడు బత్తుల రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలోని జిల్లా జాయింట్ సెక్రెటరీ సింగం శెట్టి ఈశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు దొండ రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు దొండా ఈశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# పదో రోజుకు చేరిన దీక్షలు

**చోడవరం ఆగస్టు 17 జయ జయహే**

చోడవరం మండలం గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతుల తోలిన చెరుకు బకాయిలు షుగర్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికుల జీతాలు చెల్లించాలని ఆమ్ ఆద్మీ పార్టీ చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి పదవరోజు కు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు మాట్లాడుతూ రైతన్న అన్ని పంటల కంటే చెరుకు పంట పండించడం చాలా కష్టమైన పనని, చేరుకు నాటిన దగ్గర నుంచి దిగుబడి రావాలని చెరుకు బలంగా ఎదగాలని ఎన్నో కష్టాలు పడతాడన్నారు. ఆ చెరుకు పంట అనగానే బ్యాంకుల్లో కూడా రైతులకు రుణాలు ఇస్తారనీ,ఫ్యాక్టరీ రైతుకి ఇవ్వాల్సిన డబ్బు బ్యాంక్ నుంచే వెళుతుంది కాబట్టి బ్యాంకులు ధైర్యంగా రైతు కప్పులు ఇస్తాయన్నారు. బంగారం కొదవ పెట్టి బ్యాంకులో రుణాలు తీసుకుంటారు. మరి పేదవారైతే వడ్డీకి డబ్బులు తెచ్చుకొని చెరుకు పండిస్తారు.ఈ కష్టాలు ఎన్ని కష్టాలు ఉంటాయని కలెక్టర్లు కానీ ఎమ్మెల్యేలు కానీ ఎంపీలు కానీ వీరి కష్టాలు తెలియవన్నారు. చెరకు పండించడం కూడా ఎంతో కష్టమనీ రైతు ఇన్ని బాధలు పడుతూ ఉంటే కనీసం ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరాహార దీక్ష శిబిరంలో ఆమ్ ఆద్మీ పార్టీ అనకాపల్లి జిల్లా కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు,పల్లి వెంకటరమణమూర్తి దాట్ల వెంకటేశ్వర రాజు పి అప్పారావు నారాయణ, రావికమతం మండలం నుండి గ్రామం కే సత్యనారాయణ కేసిన శెట్టి సత్తిబాబు ఆర్ సత్యనారాయణ వై రామశేషు తదితరులు పాల్గొన్నారు.

# అకడమిక్ ఇన్స్ట్రక్టర్ పోస్టులు భర్తీకి దరఖాస్తులు స్వీకరణ

**చోడవరం ఆగస్టు 17 జయ జయహే**



చోడవరం మండలంలో రెండు అకడమిక్ ఇన్స్ట్రక్టర్ సెకండరీ గ్రేడు పోస్టులు అడ్డూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల , లక్కవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లకు మంజూరు అయ్యాయి.ఈ పోస్టులు తాత్కాలిక ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారులు పి.నీలకంఠం, సింహాచలం సోమవారం పేర్కొన్నారు.ఈ సెకండరీ పోస్టులకు డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ (డి.యడ్) అర్హత కలిగి,టెట్ ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు.అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను 21 లోగా చోడవరం మండల విద్యాశాఖాధికారి వారి కార్యాలయం నకు ఆఫీసు పని వేళల్లో స్వయంగా అందజేయాలన్నారు.సంబంధిత గ్రామ,మండలానికి చెందిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.దరఖాస్తు చేయదలచిన అభ్యర్థులు నిర్దేశించిన దరఖాస్తును అర్హతా పత్రములు జెరాక్సు లను చోడవరం మండల విద్యాశాఖాధికారి వారి కార్యాలయం నకు నిర్దేశించిన గడువులోగా సమర్పించవలెను. ఎంపికైన సెప్టెంబర్ 1 నుంచి విధుల్లోకి చేరవలసి ఉంటుందని తెలియజేసారు.



# వినాయక స్వామిని దర్శించుకున్న సినీ నటుడు సాయి ధర్మతేజ్

**పూతలపట్టు, ఆగస్టు 17, జయ జయహే.**

కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని సోమవారం సినీ నటుడు సాయి ధర్మ తేజ్. దర్శించు కు న్నారు. వేద పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థప్రసాదాలు , స్వామి వారి జ్ఞాపికను అందజేశారు. సాయి ధర్మ తేజ్ మాట్లాడుతూ తను నటిస్తున్న కొత్త సినిమా విజయవంతం కావాలని స్వామివారిని దర్శించుకోవడం జరిగిందని తెలిపారు . కార్యక్రమంలో ఆలయ ఏఈవో రవి, ఆలయ అర్చకులు, జనసేన నాయకులు పూల ప్రభాకర్, అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఆలయ ఏ, ఏ ఓ, రవీంద్రబాబు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నేటినుండి చిప్పగిరిలో

# ధార్మిక కార్యక్రమాలు

**డాక్టర్ మల్లు వేంకటరెడ్డి,**

**కర్నూలు (జయ జయహే)**

తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో మండల కేంద్రమైన చిప్పగిరిలో వెలసిన శ్రీ గోవిందప్ప స్వామి దేవస్థానం నందు మంగళవారం నుండి శుక్రవారం వరకు సాయంత్రం 6 గంటల నుండి మూడు రోజులపాటు స్మాత్మానంద స్వామిచే ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, శుక్రవారం ఉదయం 10 గంటలకు గోపూజ మరియు సామూహిక కుంకుమార్చనలు శనివారం శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం నందు భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను స్థానిక భక్త సమాజంచే ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షులు నాగనాథనహళ్ళి రాఘవాచార్, ఎల్. రామచంద్ర, పి. గురుప్రసాద్, పి.వి.యం. చెన్నవీరయ్యస్వామి, యం. లక్ష్మీ నారాయణ, యస్. లోకేశ్, పి.షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనగలరని విజ్ఞప్తి చేశారు.



# సింహాచలం గురుకులానికి నిధులు

**అసెంబ్లీలో గంటాకు మంత్రి సవిత హామీ**

**విశాఖపట్నం, ఆగస్టు 17:(జయ జయహే)**

సింహాచలం మహాత్మా జ్యోతి బా పూలే గురుకుల పాఠశాలలో అసంపూర్తి భవనాలు పూర్తి చేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత సోమవారం అసెంబ్లీలో హామీ ఇచ్చారు. దీని కోసం రూ. 9.75 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. 1986 లో 13 ఎకరాల్లో స్వర్గీయ ఎన్టీఆర్ ప్రారంభించిన గురుకుల పాఠశాలలో 1,200 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని గంటా తెలిపారు. 2014- 19 మధ్య తాను విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆడిటోరియం, ప్రిన్సిపాల్ క్వార్టర్స్, స్టాఫ్ క్వార్టర్స్ నిర్మాణానికి నిధులు కేటాయించి, 70 శాతం పనులు పూర్తి చేశామని వివరించారు. అయితే తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. గతంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ భవనాల నిర్మాణానికి అసెంబ్లీలో హామీ ఇచ్చారన్నారు. గురుకుల పాఠశాలలో నిద్రిస్తున్న విద్యార్థులను ఎలుకలు కొరకడం సెన్సేషనల్ న్యూస్ అయ్యిందని, అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులిస్తే గురుకులాన్ని రోల్ మోడల్ గా ఉంటుందన్నారు. భవనాలు పూర్తి కావడానికి అవసరమైన నిధులతో పాటు మరమ్మత్తులకు అవసరమైన కేటాయింపులు చేస్తామని మంత్రి సవిత సహా లోకేష్ కూడా పేర్కొన్నారు.



## మహిళాశక్తి సేవా పురస్కారంతో

# వెంకటలక్ష్మికి సత్కారం

**విశాఖపట్నం (జయ జయహే)**

జీవన వాహిని చారిటబుల్ ట్రస్ట్ వార్షికోత్సవం సందర్భంగా, వెంకటలక్ష్మికి మహిళాశక్తి పురస్కారం లభించడం అభినందనీయం, వెంకటలక్ష్మి భారతదేశం లో చేస్తున్న రక్తదాన సేవలను జీవన వాహిని చారిటబుల్ ట్రస్ట్ గుర్తించి, తెలంగాణ లో ఉన్న అతిరధమహారధుల సమక్షంలో ఆదివారం నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియం వేదికగా నిలిచింది, తొలిత జ్యోతి ప్రజ్వలనతో సభా పర్వం ప్రారంభం అయింది,చిన్నారుల నృత్య ప్రదర్శనలతో పలువురి ప్రశంసలు పొందారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా విచ్చేసిన కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, హైదరాబాద్ అదనపు డిప్యూటీ పోలీస్ కమీషనర్ రామదాస్ తేజవత్, తెలుగు సినీ రంగానికి సంగీతాన్ని అందిస్తున్న ప్రముఖ సినీ దర్శకులు సాలూరు వాసురావు, ప్రముఖ వ్యాఖ్యత ఆశలత, మాజీ జాయింట్ డైరెక్టర్ ఉమెన్స్ మరియు చిల్డ్రన్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, తదితరులు పాల్గొన్నారు, ఈ కార్యక్రమానికి తాసుబెల్లి ఫౌండేషన్ "చైర్మన్" శంకర్ నాయుడు ఆంధ్రప్రదేశ్ నుండి పాల్గొన్నారు

# సైబర్ మోసాల వెనుక కార్పొరేట్ శక్తులున్నాయా..?

## ఆర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్

**రాజమండ్రి : జయ జయహే: ఆగస్టు 17**

దేశంలో సైబర్ నేరాలు నిత్యం పెరిగిపోతున్నాయని, నేరాలను కట్టడి చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. రాజమండ్రిలోని ఆర్పీసీ ప్రధాన కార్యాలయంలో పెండ్యాల కామరాజు అధ్యక్షతన జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాల వెనుక కార్పొరేట్ కుట్రలు? గతంలో 20 శాతంగా ఉన్న సైబర్ నేరాలు నేడు 95 శాతానికి పెరిగిపోయాయని తెలిపారు. సాధారణ సైబర్ నేరగాళ్లే ఈ దాడులు చేస్తున్నారా లేక వారి ముసుగులో ప్రభుత్వాలను శాసిస్తున్న కార్పొరేట్ దిగ్గజ శక్తులు ఈ కుట్రలకు పాల్పడుతున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. లక్షలాది మంది బాధితులు రోడ్డున పడుతున్నా, దర్యాప్తు సంస్థలు రికవరీ చేయడంలో విఫలమవుతున్నాయని, జెడి లక్ష్మీనారాయణ వంటి ప్రముఖులకు తప్ప సామాన్యులకు న్యాయం జరగడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు, విదేశీ కార్పొరేట్




శక్తులు కలిసి శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తున్నాయా అనే కోణంలో విచారణ జరగాలన్నారు.

**చేతులెత్తేస్తున్న బ్యాంకింగ్ వ్యవస్థ:**

బ్యాంకు ఖాతాల్లో సొమ్ము మాయమైనా, గూగుల్ పే, ఫోన్ పే వంటి ఆన్‌లైన్ మోసాలు జరిగినా, ఎటిఎంలలో దొంగ నోట్లు వచ్చినా బ్యాంకు అధికారులు బాధ్యత తీసుకోకుండా ఖాతాదారులను సైబర్ సెల్‌కు పంపుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నెలలు, ఏళ్లు గడిచినా బాధితులకు న్యాయం జరగడం లేదన్నారు. బ్యాంకు ఖాతాల్లో జరిగే సైబర్ మోసాలకు సంబంధించి సంబంధిత బ్యాంకు నిర్వాహకులనే పూర్తి బాధ్యులను చేసేలా వెంటనే చట్ట సవరణలు చేయాలి. సైబర్ నేరాలను అరికట్టి, బాధితుల సొమ్మును త్వరితగతిన రికవరీ చేసేలా నేర పరిశోధన సంస్థలను బలోపేతం చేయాలి. ప్రజల పొదుపు సొమ్ముకు భద్రత కల్పిస్తూ, బ్యాంకింగ్ సేవలపై విశ్వాసం పెరిగేలా మెరుగైన చర్యలు చేపట్టాలి. ఈ కార్యక్రమంలో ఆర్పిసి సీనియర్ నాయకులు డి.వి. రమణమూర్తి, ఎమ్.డి. హుస్సేన్, సిమ్మా దుర్గారావు, దుడ్డే సురేష్, వర్ధనపు శరత్ కుమార్, కారుమూరి యుగంధర్, కారుమూరి శిరీషా, మేడిచర్ల శ్రీనివాసరావు, సుంకర వెంకట భాస్కర రంగారావు, గుడ్ల సాయి దుర్గా ప్రసాద్, బసా సోనియా, చల్లా సాంబశివరావు, చల్లా అఖిల్, దోషి నిషాంత్, లంక వీర వెంకట సత్యనారాయణ, కొల్లి సత్యనారాయణ, మట్టపర్తి తులసి, మోర్త ప్రభాకర్, ఏడిద బాబులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా ఏపీయూడబ్ల్యూజే
# ఆవిర్భావ దినోత్సవం

**బుచ్చియ్యపేట,జయ జయహే**

ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం బుచ్చియ్యపేటలో యూనియన్ సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. అనంతరం పలుచోట్ల మొక్కలు నాటారు. మాడుగుల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఏపీయూడబ్ల్యూజే ఏడు దశాబ్దాలుగా సామాజిక బాధ్యతతోనే పనిచేస్తుందన్నారు. ఏపీయూడబ్ల్యూజే పాత్రికేయులు సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందన్నారు. ప్రభుత్వ వైద్యాధికారి కే. వెంకట కృష్ణ మాట్లాడుతూ... సమాజానికి, ప్రభుత్వానికి మధ్య పాత్రికేయులు వారధిగా పని చేస్తున్నారన్నారు. సమాజానికి పాత్రికేయులు అందిస్తున్న సేవలు అమోఘం అన్నారు. స్థానిక పత్రికా విలేకరులు ఎస్.రామ కోటి, ఆది. పోలిబాబు, సిహెచ్. రామలింగేశ్వర రావు, సత్యారావు, కే శ్రీనివాస్, జి. శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## బోర్రిగూడ త్రాగునీటి సమస్యపై
# స్పందించిన అధికారులు

**అరకులోయ: ఆగస్టు 17. జయ జయహే.**



అరకు వేలి మండలం మాదల పంచాయతీ బోర్రిగూడ గ్రామంలో గత వారం రోజులుగా మంచినీరు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్న సందర్భంలో స్థానిక పంచాయతీ గిరిజన సంఘం నేత కుమిడి రమేష్ పర్యటించి, సమస్యపై ఉన్నత అధికారులకు తెలియపరచి బోర్రిగూడ గ్రామంలో 300 కుటుంబం కలిగిన గ్రామంలో మంచినీటి సమస్య వెంటనే పరిష్కరించాలని కోరుతూ సమస్యలను అధికారులు గ్రామ గ్రామాలు పర్యటించి పంచాయతీ నిధులతో పరిష్కరించేల చర్య తీసుకోవాలని అధికారులతో మాట్లాడటం జరిగింది,

## డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్
# సీఎండీకి 41 వినతులు

**విశాఖపట్నం, ఆగస్టు 17, జయ జయహే**



విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న 'డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ' కార్యక్రమానికి వినియోగదారుల నుంచి 41 వినతులు అందాయి. విశాఖపట్నంలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వినియోగదారులు వివిధ సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా లో-వోల్టేజ్, విద్యుత్ బిల్లులు, లైన్ షిఫ్టింగ్, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు, రూఫ్‌టాప్ సోలార్, కొత్త విద్యుత్ కనెక్షన్లకు సంబంధించిన ఫిర్యాదులు మరియు వినతులను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ వినతులను సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1912 కు కాల్ చేయడం లేదా 9493681912 వాట్సాప్ నంబర్‌కు చాట్ చేయడం ద్వారా కూడా తమ విద్యుత్ సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవచ్చని సంస్థ సూచించింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్ టి.వి. సూర్యప్రకాష్, సీజీఎం పి. సోల్మన్ రాజు, జనరల్ మేనేజర్లు ఎం. రఘూన్సీ, వి.వి.ఎస్.ఎన్.వి. ప్రసాద్, వి.వి. కిషోర్ తదితరులు పాల్గొన్నారు.




# అరుదైన వ్యాధుల చిన్నారులకు ప్రభుత్వమే వైద్యం అందించాలి

**రాజమహేంద్రవరం: జయ జయహే: ఆగస్టు 17 :**

అరుదైన వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు అవసరమైన వైద్యాన్ని ప్రభుత్వమే ఉచితంగా అందించాలని కోరుతూ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ అండ్ అవేర్‌నెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాఆధ్వర్యంలో 'ఆపరేషన్ రేర్ జస్టిస్' కార్యక్రమం నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు సత్య గుమ్మాపు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఈ. బిందు చౌదరి మాట్లాడుతూ, "నో చైల్డ్ లెఫ్ట్ బిహైండ్" నినాదంతో ప్రతి చిన్నారికి హక్కులు, భద్రత, విద్య, గౌరవప్రదమైన జీవనం అందేలా ప్రభుత్వం, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. బాలలపై జరుగుతున్న అన్యాయాలు, వివక్షపై ప్రజల్లో అవగాహన పెంచడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.ఎం. జగదీష్ నాయుడు, సిరాజుద్దీన్, ప్రభావతి, రాజ్యలక్ష్మి, గుంటూరు వెంకటరమణ, జగిర్, మీనాక్షి రెడ్డి, పచ్చిపాల వీరబాబు, సాయి కిషోర్, పచ్చిపాల కల్యాణి, దుర్గ, పిచ్చుక మహేష్ తదితరులు పాల్గొన్నారు. బాధిత చిన్నారులకు న్యాయం జరిగే వరకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని వారు పేర్కొన్నారు.



# పిజిఆర్ఎస్‌లో 27 ఫిర్యాదులు స్వీకరణ

**రాజమహేంద్రవరం, జయ జయహే :ఆగస్టు 17:**

రాష్ట్ర ప్రభుత్వంప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ కార్యక్రమాన్ని పోలీసుకార్యాలయంలో సోమవారం జిల్లా అదనపు పోలీసు సూపరింటెండెంట్ (అడ్మిన్) పాటిల్ దేవరాజ్ మనీష్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 27 ఫిర్యాదులను స్వీకరించిన ఆయన, బాధితుల సమస్యలను స్వయంగా తెలుసుకుని సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, చట్టపరిధిలో సత్వర పరిష్కారం చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో సివిల్ వివాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులుతో పాటు ఇతర అంశాలకు సంబంధించిన వినతులు ఉన్నాయి. కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలిగా పురంధేశ్వరికి పిక్కి నాగేంద్రఅభినందనలు



బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలిగా నియమితులైన ఎంపి దగ్గుబాటి పురంధేశ్వరికి తూర్పుగోదావరి జిల్లా బిజెపి అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలో మహిళా మోర్చా ఇన్‌చార్జి, జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షురాలిగా సమర్థవంతంగా పనిచేసిన పురంధేశ్వరికి జాతీయ ఉపాధ్యక్షురాలి బాధ్యతలు అప్పగించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఆమె నాయకత్వంలో 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి బలపడిందని, బిజెపి 8 ఎమ్మెల్యేలు, 3 ఎంపి స్థానాలు గెలుచుకుందని గుర్తుచేశారు. జాతీయ స్థాయిలో పురంధేశ్వరి సేవలు ఆంధ్రప్రదేశ్‌తో పాటుతూర్పుగోదావరి జిల్లా అభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



# కూటమి పాలన భేష్..

## పూనెం శశికళ..

**పోలవరం,జయ జయహే**

కూటమి ప్రభుత్వం గడచిన రెండేళ్ల పాలన లో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధికి ప్రాధన్యత నిస్తూ ముందుకు వేళుతున్నదని గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమం లో నాయకులు పేర్కొన్నారు. పోలవరం లోని నూతన గూడెం లో సోమవారం సాయంత్రం నిర్వహించిన ప్రచారం లో పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటిటికీ తిరుగుతూ ప్రభుత్వపధకాలు ఏ విధంగా అందు తున్నదీ అడిగి తెలుసు కున్నారు. ప్రతి చోటా ప్రజలు సాదర స్వాగతం పలికి సమస్యలు చెప్పారని నాయకులు పేర్కొన్నారు.

**ప్రభుత్వ పధకాలు అందు తున్నాయా?**

ఈ సందర్భంగా మహిళా నేత పూనెం శశికళ తదితరులు కర పత్రాన్ని ఇచ్చి ప్రత్యేకంగా ప్రతి వారినీ ప్రభుత్వం, వృద్ధాప్య, వితంతు తదితర పెన్షన్లుఎలా అందిస్తున్నదీ అలాగే తల్లికి వందనం, ఉచితంగా గ్యాస్ సిలెండర్ తల్లికి వందనం మొదలగు పధకాలు గురించి వాకబు చేయడం ప్రత్యేకఆకర్షణ గా నిలిచింది. అయితే వారు ప్రభుత్వం మహిళలకు ఇస్తా మని ప్రకటించిన రూ 1500/-నిరుద్యోగభృతి గురించి అడగ్గా దశల వారీ గా అన్ని పధకాలు అందించడా నికి ప్రభుత్వం సిద్ధం గా వుంది అని సమాధాన పర్చారు. తమ ప్రాంతం లో డ్రై నేజీ సమస్యలు వున్నాయని వీధి లైట్లు కావాలని కోరారు. మండలటీడీపీ అధ్యక్షుడు మంగిన వెంకట్ రమణ (కొండ )ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం లో శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగ దీశ్వరి, కొవ్వాడ సూలూయిాస్ ఛైర్మన్ పాదం ప్రసాద్, జల్లే పల్లిసుబ్బారావు, నల్లా రాంబాబు, ఎడ్ల వినోద్ తదితరులు పాల్గొన్నారు.




# వీఎంఆర్‌డీఏ ప్రజా దర్బార్‌కు 9 వినతులు

**విశాఖపట్నం (జయ జయహే)**

వీఎంఆర్డీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు 9 వినతులు వచ్చాయి. సోమవారం వీఎంఆర్‌డీఏ కార్యాలయ సమావేశమందిరంలో జరిపిన ప్రజాదర్బార్‌లో వీఎంఆర్‌డీఏ కార్యదర్శి మురళీకృష్ణ, ఓఎస్‌డీ (ప్రాజెక్ట్స్) కృష్ణ నాయక్ తదితరులు పాల్గొని అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఆర్జీదారుల సమస్యలను స్వయంగా తెలుసుకుని, ఆయా వినతులను సంబంధిత అధికారులకు అందజేశారు. ఆయా ఆర్జీలను నిశితంగా పరిశీలించి, ఆయా సమస్యకు సత్వరమే పరిష్కారం చూపాలని ఆదేశించారు. గడువులోగా అర్జీదారులు ఇచ్చిన వినతులకు సంబంధించి శాఖాపరంగా తీసుకున్న చర్యలను తెలియజేయాలని సూచించారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన వినతుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. సోమవారం జరిగిన ప్రజాదర్బార్‌కు మొత్తం 9 వినతులు రాగా, వాటిలో ప్లానింగ్ విభాగానికి చెందినవి 7, ఇంజనీరింగ్ విభాగానికి 1, ఇతర పరిపాలన విభాగానికి 1 చొప్పున వచ్చాయి. కార్యక్రమంలో ఏస్టేట్ అధికారి దయానిధి, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మెగాస్టార్ పుట్టినరోజుసందర్బంగా మొక్కలు నాటే కార్యక్రమం

**విజయనగరం, ఆగస్టు 17: (జయ జయహే )**

విజయనగరం జిల్లా చిరంజీవి యువత, విజయనగరం జిల్లా మెగా యూత్ ఫోర్స్, అంజనీపుత్ర చిరంజీవి ప్రజా సేవా సంఘం అండ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం అయ్యన్నపేట జంక్షన్ వద్ద వాటర్ ప్లాంట్ సమీపంలోని మున్సిపల్ నడక మైదానంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సీనియర్ మెగాభిమాని, మెగా యూత్ ఫోర్స్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు కొయ్యాన లక్ష్మణ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సామాజిక కార్యకర్త, విజయనగరం జిల్లా చిరంజీవి అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు (బాలు) మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు. మెగా ఫ్యామిలీ అభిమానులు సేవా కార్యక్రమాల్లో ముందుండడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మెగా ఫ్యామిలీ అభిమానులు, జనసేన పార్టీ నాయకులు సుంకరి విజయ్, యాగాటి నల్లమరాజు, పిన్నింటి రమేష్, రమేష్ బాబు, లెంక రవి, కోట్ల సత్యనారాయణ, ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# కొలెస్ట్రాల్ సమస్య

## ఒక్క స్పూన్ నూనెతో ఇలా వండేయండి.. ఆరోగ్యంతో పాటు రుచి కూడా

నూనె మసాలాలతో కూడిన ఆహారాన్ని ఎంత ఎక్కువగా తీసుకుంటే కొలెస్ట్రాల్-మధుమేహం సమస్యలు అంతగా త్వరగా పెరుగుతాయి. వీలైనంత వరకు వేపుడు పదార్థాలకు దూరంగా ఉండటం మంచిది. ట్రైగ్లిజరైడ్స్ లేదా కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్ సమస్యలు, ఊబకాయం ఉన్నవారు నూనె అస్సలు తినకూడదు. అలాగని.. ఒక్క చుక్క నూనెతో వంట చేయడం సాధ్యం కాదు. అయితే, వంటలో నూనె మొత్తాన్ని తగ్గించి వంట చేసుకోవచ్చు. అంటే 5 స్పూన్లకు బదులుగా 1 చెంచా ఉపయోగించవచ్చు. వంటల్లో నూనె వాడకాన్ని ఎలా తగ్గించాలో ఇక్కడ తెలుసుకుందాం..

నాన్ స్టిక్ పాన్ కొద్దిగా నూనెతో బాగా ఉడుకుతుంది. నాన్ స్టిక్ పాన్ లో కొద్దిగా నూనె రాస్తే త్వరగా ఉడికిపోతుంది. నూనె పాత్ర నుంచి నేరుగా పాన్ లోకి నూనె పోయవద్దు. ఒక చెంచా లేదా కొలిచే కప్పు ఉపయోగించాలి. నూనె పేస్ట్ కూడా ఉపయోగించవచ్చు.

వేయించిన ఆహారాన్ని ఎంత తక్కువ తింటే అంత ఎక్కువగా నూనె శరీరంలోకి చేరుతుంది. బదులుగా కాల్చిన ఆహారాలు తినడానికి ప్రయత్నించండి. నూనె పూసిన చేపలు, మాంసాన్ని కాల్చిన తర్వాత ఆహారంగా తీసుకోవచ్చు.మంటపై కాల్చకపోయినా, ఆవిరిపై కూడా వండుకోవచ్చు. ఇందుకు తక్కువ నూనె సరిపోతుంది. సుగంధ ద్రవ్యాలతో చేపలు, మాంసం, గుడ్లు ఆవిరి మీద ఉడికించి రుచిగా తినవచ్చు.

పాన్‌లో ఆయిల్ వేసి విడిగా ఉడికించాల్సిన అవసరం లేదు. చేపలు, మాంసం లేదా ఇతర కూరగాయలను పులుసు మాదిరి కలిపి సన్నని మంటపై ఉడికించినా సరిపోతుంది. అన్నంలో రుచిగా ఉంటుంది.

## వర్కౌట్స్ రెగ్యులర్‌గా చేస్తే

# మెరిసే స్కిన్ మీ సొంతం

**స్కిన్ మెరవడానికి చాలా మంది చాలా ట్రై చేస్తుంటారు. అయితే, హెల్దీ లైఫ్‌స్టైల్ కారణంగానే స్కిన్ అందంగా మెరుస్తుంది. దీంతోపాటు స్కిన్ రొటీన్ ఫాలో అవ్వాలి. దీంతో పాటు కొన్ని ఎక్సర్‌సైజెస్ కూడా హెల్ప్ చేస్తాయి. అవేంటో తెలుసుకోండి. ఎక్సర్‌సైజెస్ ఆరోగ్యానికి ఎంత మంచివో.. శరీరానికి కూడా అంతే మంచివి. ఎక్సర్‌సైజ్ చేయడం వల్ల చెమట వస్తుంది. దీంతో స్కిన్ క్లియర్ అవుతుంది. స్కిన్ మెరుస్తుంది కూడా. మరి ఏ ఎక్సర్‌సైజెస్ చేస్తే స్కిన్‌కి మంచిది. స్కిన్ అందంగా మెరుస్తుందో పూర్తి వివరాలు తెలుసుకోండి.**




### ఫేషియల్ యోగా..

ఫేషియల్ యోగా కూడా స్కిన్ గ్లోయింగ్‌కి హెల్ప్ చేస్తుంది. దీని వల్ల ఎలాంటి బొటాక్స్, సర్జరీ చేయకుండానే స్కిన్ లిఫ్ట్ అవుతుంది. దీని వల్ల ఫేషియల్ మజిల్స్ టోన్ అవుతాయి. దీనిని రెగ్యులర్‌గా చేస్తే స్కిన్ టోన్ అవుతుంది. ఫేషియల్ యోగాలో స్కిన్ గ్లో అవ్వడానికి ఫిష్ లిప్స్, కిస్ ఫేస్, విజిల్స్ వంటి ఫేషియల్ యోగా వర్కౌట్స్ చేయొచ్చు. దీని వల్ల స్కిన్ గ్లో అవుతుంది.

### వెయిట్ ట్రైనింగ్..

మీరు గనుక జిమ్‌లో అయినా, ఇంట్లో అయినా వెయిట్ ట్రైనింగ్ వర్కౌట్స్ చేస్తే అది మీ బాడీకి, స్కిన్‌కి చాలా హెల్ప్ చేస్తాయి. ఏ వెయిట్ ట్రైనింగ్ అయినా మజిల్స్‌ని టోన్ చేస్తాయి. స్కిన్ అందంగా మెరుస్తుంది. దీని వల్ల మజిల్స్ టైట్ అవుతాయి. స్కిన్ యంగ్‌గా కనిపించేలా చేస్తుంది. దీనికోసం వారంలో రెండు, సార్లు వెయిట్ ట్రైనింగ్ వర్కౌట్స్ చేయొచ్చు.



### ఏరోబిక్స్..

స్కిన్ కోసం కేవలం హై ఇంటెన్సిటీ వర్కౌట్స్ మాత్రమే చేయాల్సిన అవసరం లేదు. ఏరోబిక్స్ కూడా హెల్ప్ చేస్తాయి. ఏరోబిక్స్ కారణంగా స్కిన్ క్లియర్ అవుతుంది. కొల్లాజెన్ ప్రొడక్షన్ పెరుగుతుంది. కొల్లాజెన్ కారణంగా చర్మంలో సాగే గుణం పెరుగుతుంది. దీని వల్ల ముడతలు తగ్గుతాయి. స్కిన్ అందంగా కనిపిస్తుంది.

### స్విమ్మింగ్..

స్విమ్మింగ్ పూల్‌లో క్లోరైన్ ఉంటుంది. ఇది ఒక్కొక్కరి స్కిన్‌పై ఒక్కో ఎఫెక్ట్‌ని చూపిస్తుంది. క్లోరైన్‌లో కొన్ని యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్నాయి. అవి బ్రేక్ అవుట్స్ కాకుండా హెల్ప్ చేస్తాయి. కేవలం స్కిన్‌కి మాత్రమే కాదు. బరువు తగ్గడానికి కూడా హెల్ప్ అవుతుంది. దీంతో పాటు స్కిన్ టోన్ కూడా ఇంప్రూవ్ అవుతుంది.

### రన్నింగ్..

రన్నింగ్ చేయడం వల్ల చెమట ఎక్కువగా వస్తుంది. దీంతో స్కిన్ పోర్స్ ఓపెన్ అవుతాయి. దీని వల్ల దుమ్ము, ఆయిల్ అన్నీ కూడా బయటికి వస్తాయి. దీని వల్ల స్కిన్‌కి మంచి లుక్ వస్తుంది. రన్నింగ్ చేయడానికి మీరు జిమ్‌కి వెళ్ళడం, ట్రెడ్‌మిల్ కూడా వాడాల్సిన అవసరం లేదు. మీరు ఖాళీ ప్లేస్‌లో రన్నింగ్ చేయొచ్చు. దీని వల్ల బ్లడ్ పంప్ అవుతుంది. దీంతో స్కిన్ పోర్స్ ఓపెన్ అవుతాయి. అయితే, బయట రన్ చేసేటప్పుడు సన్‌స్క్రీన్ రాసుకోవడం మర్చిపోవద్దు.

### వీటితో పాటు..

కాస్లీసీరమ్, స్క్రబ్స్ బదులు నేచురల్ స్కిన్‌కేర్ చాలా మంచిది. బ్యాలెన్స్డ్, హెల్దీ లైఫ్‌స్టైల్ ఫాలో అవ్వడం వల్ల స్కిన్ హెల్దీగా కనిపిస్తుంది. ఎక్సర్‌సైజ్ చేయడం వల్ల కూడా స్కిన్ నేచురల్‌గా గ్లో అవుతుంది. జిమ్ చేయడం, వర్కౌట్స్ చేసేటప్పుడు డియోడ్రెంట్ వంటి ప్రోడక్ట్స్‌ని మర్చిపోవద్దు.

# నోట్లో వేసుకుంటే కరిగిపోయే పైన్ నట్స్



## ఎన్నో వ్యాధులకు దివ్యౌషధం

అనేక పోషకాలున్న పైన్ నట్స్ ధర మాత్రం చాలా ఎక్కువ. కిలోకు దాదాపుగా 8000 రూపాయల దాకా ఉంటుంది. అంటే ఓ గ్రాము బంగారంతో సమానం. పైన్ గింజలు తినడానికి చాలా రుచికరమైనవి. పోషకమైనవి. ఇది మనల్ని అనేక వ్యాధుల నుండి రక్షించే దివ్యౌషధం.

మనకు అందుబాటులో ఉన్న అనేక డ్రైఫ్రూట్స్‌లలో రుచికరమైనవి అంటే..జీడిపప్పు, బాదాం, పిస్తాలే కాదు.. అంతకుమించిన మధురమైన రుచి ఈ పైన్ నట్స్‌కు ఉంటుంది. తినడానికి క్రీమీగా, నోట్లో వేసుకుంటే కరిగిపోతాయి. ఏదో మంచి స్వీట్ తిన్న అనుభూతి వస్తుంది.

పైన్‌నట్స్‌లో అధిక శాతం అసంతృప్త కొవ్వు ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇందులో విటమిన్ ఇ, ఫైబర్, ప్రోటీన్, మెగ్నీషియం, కాల్షియం, ఫాస్పరస్ వంటి అనేక ఇతర పోషకాలు పైన్ గింజలలో ఉన్నాయి. పైన్ గింజలలో కాల్షియం పుష్కలంగా లభిస్తుంది. ఇది ఎముకలు దృఢంగా ఉంచుతుంది.

వీటిని తినడం వల్ల కొవ్వులున్న జంక్ ఫుడ్ తినాలనే కోరిక తగ్గుతుంది. బరువు తగ్గాలని ప్రయత్నించేవారు చిల్గోజా తినడం అలవాటు చేసుకోవాలి. అనారోగ్యకర ఆహారాలు తినాలనే కోరిక తగ్గించడంతో పాటూ బరువు తగ్గడంలోనూ ఇది సాయపడుతుంది. అంతేకాదు..చిల్గోజాలో ఒమేగా 6, సెలీనియం ఉంటాయి. ఇవి క్యాన్సర్ కణాలు పెరగకుండా నిరోధిస్తుంది. క్యాన్సర్ రాకుండా కాపాడుతుంది.

చిల్గోజాలో జింక్ పుష్కలంగా ఉంటుంది. ఇది సంతానలేమి వంటి సమస్యను తొలగించడానికి సహాయపడుతుంది. చిల్గోజా సాధారణ జలుబు నుండి రక్షించడానికి కూడా సహాయపడుతుంది. జింక్ పరిమాణం గాయం వేగంగా నయం చేయడానికి సహాయపడుతుంది.

పైన్ గింజల గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువవ్వడం వల్ల డయాబెటిస్ లో కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. దీనివల్ల ఇన్సులిన్ పనితీరు పెరుగుతుంది. చిల్గోజా తినడం వల్ల డయాబెటిస్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. డిప్రెషన్, చిరాకు, మూడ్ స్వింగ్స్ వంటి సమస్యలు ఉన్నవారు ఆహారంలో చిల్గోజా చేర్చుకోవాలి. మెగ్నీషియం మోతాదు ఈ సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. అలాగే రాత్రిపూట చిల్గోజా తింటే కండరాలు రిలాక్స్ అవుతాయి.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com